తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-28 - జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 240 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


# అరూరి రీఎంట్రీ.. వర్ధన్నపేటకా? స్టేషన్ ఘనపూర్‌కా?




## ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో కొత్త సమీకరణలకు తెర

**హన్మకొండ,జనవరి27(తెలంగాణ ముచ్చట్లు):** ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో మరో కీలక మలుపు చోటుచేసుకోబోతోంది. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బిజెపి పార్టీకి రాజీనామా చేసి తిరిగి సొంత గూటి (బిఆర్ఎస్)లో నేడు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆయన అధికారికంగా పార్టీలో చేరనున్నారు.అయితే ఈ చేరికకంటే ముందే రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. అరూరి రమేష్ తిరిగి బిఆర్ఎస్‌లోకి రావడం కంటే, ఆయన రాజకీయ ప్రయాణం ఇక ఏ నియోజకవర్గం చుట్టూ తిరగబోతుందన్నదే ప్రస్తుతం ప్రధాన చర్చగా మారింది. గతంలో ప్రాతినిధ్యం వహించిన వర్ధన్నపేట వైపు అడుగులు వేస్తారా? లేక స్టేషన్ ఘనపూర్ రాజకీయాల పై దృష్టి సారిస్తారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు ఉమ్మడి వరంగల్ అంతటా వినిపిస్తున్నాయి. ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్న అంశం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో జరుగుతున్న రాజకీయ కదలికలే. గోవర్ధనగిరి నుంచి హైదరాబాద్‌కు భారీ కాన్వాయ్‌తో వెళ్లేందుకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఈ ర్యాలీలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనేలా ప్రణాళికలు రూపొందుతున్నాయని తెలుస్తోంది. ఇది సాధారణ పార్టీలో చేరిక కార్యక్రమంగా కాకుండా, ఒక రాజకీయ సంకేతంగా భావిస్తున్నవారు లేకపోలేదు.

ఇదే సమయంలో అరూరి రమేష్‌కు బిఆర్ఎస్‌లోకి స్వాగతం తెలుపుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పోస్టర్లు రూపొందించి వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా వేదికలపై వైరల్ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వర్ధన్నపేట కంటే స్టేషన్ ఘనపూర్ కేంద్రంగా ఈ ప్రచారం జరగడం వెనుక వ్యూహాత్మక ఆలోచన ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ పరిణామాలన్నింటిని కలిపి చూస్తే, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య రాజకీయ భవితవ్యంపై ప్రభావం చూపేలా పావులు కదుపుతున్నారా అన్న సందేహాలు బలపడుతున్నాయి. ఘనపూర్‌లో ఉప ఎన్నిక వస్తే, బిఆర్ఎస్ తరఫున మరింత బలమైన నాయకత్వాన్ని రంగంలోకి దింపాలన్న ఆలోచన పార్టీ పెద్దల్లో ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో అరూరి రమేష్‌ను ప్రత్యామ్నాయంగా సిద్ధం చేస్తున్నారా? అన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది.మొత్తానికి, బిఆర్ఎస్‌లో అరూరి రమేష్ రీఎంట్రీతో ఉమ్మడి వరంగల్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేచినట్టే కనిపిస్తోంది. ఆయన అడుగులు వర్ధన్నపేట వైపా, స్టేషన్ ఘనపూర్ వైపా అన్నది తేలాలంటే కొద్దిరోజులు వేచిచూడాల్సిందే. కానీ, ఈలోపే రాజకీయ ఉష్ణోగ్రతలు మాత్రం గణనీయంగా పెరిగాయని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.అరూరి స్వగ్రామం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఉండడం గమనార్హం.

## ఆరూరి రమేష్ రాజకీయ ప్రస్థానం



ఆరూరి రమేష్ 2009లో ప్రజా రాజ్యం పార్టీతో తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. అదే ఏడాది ఘన్‌పూర్ శాసనసభ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరిన ఆయన, 2014లో జరిగిన తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కొండేటి శ్రీధర్‌పై 86,349 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. 2015 జనవరి 10 నుంచి 2018 సెప్టెంబరు 6 వరకు తెలంగాణ లెజిస్లేచర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీల్లో అక్రమాలపై హౌస్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2018 ముందస్తు ఎన్నికల్లోనూ అదే పార్టీ తరఫున పోటీ చేసి తెలంగాణ జన సమితి అభ్యర్థి పగిడిపాటి దేవయ్యపై 99,240 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2022 జనవరి 26న వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

2023 శాసనసభ ఎన్నికల్లో బిఆర్ఎస్ తరఫున వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆరూరి రమేష్, కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజు చేతిలో 19,458 ఓట్ల తేడాతో ఓడిపోయారు. అనంతరం 2024 మార్చి 16న బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి, మార్చి 17న భారతీయ జనతా పార్టీలో చేరారు. అదే ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య చేతిలో 2,20,339 ఓట్ల తేడాతో పరాజయం ఎదుర్కొన్నారు. చివరగా 2026 జనవరి 26న భారతీయ జనతా పార్టీకి రాజీనామా చేయడంతో ఆయన రాజకీయ ప్రయాణం మరో మలుపు తిరిగినట్టుగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.



## ధర్నా చౌక్‌లో మహాధర్నాలో బీజేపీ నిరసన

- రిటైర్డ్ ఉద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్
- పెండింగ్ డీఏలు, పీఆర్సీ అమలులో వైఫల్యం
- ఉద్యోగులు, పెన్షనర్ల ఆగ్రహమే హెచ్చరిక

**హైదరాబాద్, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు లెక్కపెట్టబడ్డాయని, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులే కాంగ్రెస్‌ను రాజకీయంగా సమాధి చేస్తారని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు రాంచెందర్ రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా మోసం చేస్తోందని ఆరోపిస్తూ ధర్నా చౌక్‌లో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొని ఆయన ప్రసంగించారు.

మిగతా 2లో


## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట సంతోష్‌రావు

- జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో విచారణ
- సోమవారం నోటీసులు మంగళవారం హాజరు
- అడిగే ప్రశ్నలన్నింటికీ సమాధానాలు ఇస్తానన్న సంతోష్‌రావు
- ఇప్పటికే హరీశ్‌రావు, కేటీఆర్‌ల విచారణ పూర్తి



**హైదరాబాద్, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** బీఆర్ఎస్ పార్టీ కీలక నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు సంతోష్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం ఎదుట విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో సిట్ అధికారులు ఆయనను ప్రశ్నిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణకు హాజరుకావాలని సోమవారం సిట్ సంతోష్‌రావుకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసుల మేరకు మంగళవారం ఆయన విచారణకు హాజరయ్యారు. నోటీసులు అందుకున్న అనంతరం సంతోష్‌రావు మీడియాతో మాట్లాడుతూ, సిట్ అధికారులు అడిగే అన్ని ప్రశ్నలకు పూర్తిస్థాయిలో సమాధానాలు ఇస్తానని తెలిపారు.

మిగతా 2లో




## జీహెచ్ఎంసీ మెగా స్పెషల్ పారిశుధ్య డ్రైవ్

- అంబర్‌పేట, కవాడిగూడలో క్షేత్రస్థాయి తనిఖీలు
- ప్రజలతో నేరుగా సంభాషణ, సమస్యల పరిష్కారం
- ప్రజా మరుగుదొడ్ల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి
- నగరమంతా పరిశుభ్రత– ఆరోగ్య వాతావరణ లక్ష్యం

**హైదరాబాద్, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** నగరాన్ని మరింత పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన మెగా స్పెషల్ పారిశుధ్య డ్రైవ్ 29వ రోజుకూ కొనసాగుతోంది.

మిగతా 2లో



## గంజాయి ముఠా దాడిలో గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి విషమం

- కడుపుపై తీవ్ర గాయం... లివర్, కిడ్నీలకు నష్టం
- ఎడమ కిడ్నీ తొలగింపు... ఐసీయూలో నిరంతర పర్యవేక్షణ
- వాహనాల తనిఖీలో కారుతో ఢీకొట్టిన ముఠా
- ప్రత్యేక బృందాలతో నిందితుల వేట

2లో

## మోగిన మున్సిపల్ ఎన్నికల నగారా

- 11న మున్సిపోల్..
- 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు..
- షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల సంఘం




**హైదరాబాద్,జనవరి27(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో పురపాలక సంఘాల ఎన్నికలకు నగా రా మోగింది. ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని ఎస్ఈసీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో కిక్కిరిసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తక్షణమే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని చెప్పారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. మొత్తం ఏడు కార్పొరేషన్లలోని 414 వార్డులకు, 32 జిల్లాల్లోని 116 మున్సిపాలిటీల్లో 2,582 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మిగతా 2లో



## గంజాయి ముఠాలకు ప్రభుత్వ భయం లేదు -కవిత

- నిమ్స్‌లో గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యకు పరామర్శ
- గ్రామాల నుంచి పాఠశాలల వరకు విస్తరించిన మత్తు పదార్థాలు
- మహిళలు, కుటుంబాలపై తీవ్ర ప్రభావం
- ఎక్సైజ్, ఫారెస్ట్ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలి

**హైదరాబాద్, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** నిజామాబాద్‌లో గంజాయి ముఠా దాడిలో తీవ్రంగా గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను, ఆమె కుటుంబ సభ్యులను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా వైద్యులను చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మోగిన మున్సిపల్ ఎన్నికల నగారా

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం ఉదయం 10.30 నుంచి 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని వెల్లడించారు. 31న నామినేషన్ల పరిశీలన, అనంతరం చెల్లుబాటైన అభ్యర్థుల జాబితా ప్రచురిస్తామని చెప్పారు. నామినేషన్ల తిరస్కరణపై ఫిబ్రవరి 1న అప్పీల్ చేసుకోవచ్చని, దాఖలైన అప్పీళ్లను 2న పరిష్కరిస్తామని తెలిపారు. ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 3 గంటలోపు నామినేషన్ల ఉపసంహరణకు గడువు తేదీ కాగా, బరిలో నిలిచిన తుది అభ్యర్థుల జాబితాను మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రకటిస్తామని వెల్లడించారు.
సుమారు వారంపాటు ప్రచారం కోసం అభ్యర్థులకు అవకాశం ఉంటుందని, ఫిబ్రవరి 11న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని వివరించారు. రీపోలింగ్ అవసరమైతే 12న నిర్వహిస్తామని తెలిపారు. 13న ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలు ప్రకటిస్తామని పేర్కొన్నారు. 16న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్లను ఎన్నుకుంటారని చెప్పారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52,43,00 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని వివరించారు.

**100 శాతం వెబ్ కాస్టింగ్**

రాజకీయ పార్టీల గుర్తులపై ఎన్నికలు జరుగుతాయని కమిషనర్ రాణికుముదిని వెల్లడించారు. బ్యాలెట్ పేపర్ ద్వారా జరిగే ఎన్నికల కోసం 16,031 బ్యాలెట్ బ్యాక్సులు రెడీ చేశామని తెలిపారు. ఓట్ల లెక్కింపు కోసం 136 కేంద్రాలను సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణ, ఎన్నికల కోడ్ అమలు, ఇతర అంశాలను పరిశీలించేందుకు అధికారుల బృందాలను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. వారికి శిక్షణ కూడా ఇచ్చామని వెల్లడించారు. అన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోని అన్ని పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్ కాస్టింగ్ ఉంటుందని చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్లో కూడా రికార్డింగ్ ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా పాటించాలని, స్వేచ్ఛగా, నిర్భయంగా, నిష్పాక్షికంగా ఓటు వేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని ఓటర్లకు, అభ్యర్థులకు విజ్ఞప్తి చేశారు. ఓట్ల పండుగకు హాజరై 85 శాతానికిపైగా పోలింగ్ నమోదయ్యేలా సహకరించాలని కోరారు.

**అంతా సిద్ధం చేశాం: టీకే శ్రీదేవి**

రాష్ట్రంలో మొత్తం 133 మున్సిపాలిటీలు ఉండగా, పాలకవర్గాల గడువు తీరిన, కొత్తగా ఏర్పడిన ఏడు నగరపాలక సంస్థలు, 116 పురపాలక సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పురపాలకశాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి చెప్పారు. ఫొటోలతో కూడిన ఓటర్‌కార్డులు ఇప్పటికే సిద్ధం చేశారని, రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి రిజర్వేషన్లు ఖరారు చేశామని తెలిపారు. చట్టాలు, నిబంధనల ప్రకారం.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలకు రిజర్వేషన్లు కేటాయించినట్టు వెల్లడించారు. నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. సమావేశంలో ఎస్ఈసీ కార్యదర్శి లింగ్యానాయక్, ఎన్నికల పర్యవేక్షకుడు మందా మకరంద్ పాల్గొన్నారు.

**16న చైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నిక**

మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్‌పర్సన్లు, కార్పొరేషన్‌లో మేయర్, డిప్యూటీ మేయర్ల ఎన్నికల షెడ్యూల్‌ను కూడా ఎస్ఈసీ ప్రకటించారు. తెలంగాణ మున్సిపాలిటీ చట్టం 2019లోని సెక్షన్ 20 ప్రకారం.. ఆయా పదవులకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు కోసం అధికారులు ఎన్నికల ఫలితాలు ప్రకటించిన మరుసటి రోజు 14న లేదా అంతకుముందే నోటీసులు ఇవ్వాలని షెడ్యూల్‌లో సూచించారు. ఫిబ్రవరి 16న ఉదయం 11 గంటల నుంచి మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్లలో ప్రత్యక్షంగా కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణం స్వీకారం చేయాలని తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటల తర్వాత మున్సిపాలిటీ చైర్‌పర్సన్/వైస్‌చైర్‌పర్సన్, మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక నిర్వహించాలని కమిషనర్ సూచించారు. చైర్‌పర్సన్/మేయర్ ఎన్నికలు పూర్తయ్యేవరకు వైస్ చైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్ ఎన్నికలు నిర్వహించకూడదని పేర్కొన్నారు. ఏ కారణం చేత అయినా ఆ పదవుల ఎన్నిక జరుగకపోతే మరుసటి రోజు నిర్వహించాలని స్పష్టంచేశారు.

### నోటిఫికేషన్ షెడ్యూల్

**నోటిఫికేషన్ విడుదల: 28.01.2026**
**నామినేషన్ల స్వీకరణ: 28.01.2026 ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు**
**నామినేషన్ల దాఖలు చివరి తేదీ: 30.01.2026 సాయంత్రం గంటల వరకు**
**నామినేషన్ల పరిశీలన:31.01.2026 ఉదయం 11 గంటల నుంచి**
**చెల్లుబాటైన నామినేటెడ్ అభ్యర్థుల జాబితా: 31.01.2026 నామినేషన్ల పరిశీలన పూర్తయిన వెంటనే**
**నామినేషన్ల తిరస్కరణపై అప్పీల్:01.02.2026 సాయంత్రం 5 గంటల వరకు**
**అప్పీళ్ల పరిష్కారానికి గడువు: 02.02.2026 సాయంత్రం 5 గంటలలోపు**
**నామినేషన్ల ఉపసంహరణ గడువు: 03.02.2026 మధ్యాహ్నం 3 గంటలలోపు**
**పోటీచేసే అభ్యర్థుల తుదిజాబితా ప్రకటన:03.02.2026 మధ్యాహ్నం 3 గంటల తర్వాత**
**పోలింగ్ తేదీ: 11.02.2026 ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు**
**రీపోలింగ్ అవసరమైతే : 12.02.2026**
**ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన తేదీ:13.02.2026 ఉదయం 8 గంటల నుంచి**


## ఆంక్షల్లో లేని స్త్రీని సహించరు వీళ్ళు.!

స్పృహ కలిగిన స్త్రీలు
చైతన్యవంతులౌతారు.
చైతన్యం గల స్త్రీలు
తమని అణిచిపెట్టిన సంప్రదాయాల్ని,
కట్టడి చేసిన కట్టుబాట్లని దిక్కరిస్తారు.

అలా మూఢత్వాలని దిక్కరించే స్త్రీలు..
వాళ్ళని వెనక్కి లాగాలని చూసే
పితృస్వామ్యాన్ని
వారి కాలుకింద తొక్కి పడుతూ
గుండే ధైర్యంతో ముందుకే నడుస్తారు.
వీళ్ళని ఆపడం
ఎవరి తరము కాదు.

అందుకే
తమ కోసం తాము నిలబడే స్త్రీలు
ఈ జనాలకి
బరితెగించిన వాళ్ళుగా కనిపిస్తారు.

మనువు కుట్రనర్థం చేసుకోని
ఈ అమాయకులు
వాళ్ళు బానిసలుగా
బతుకుతునన్నందుకు గాక,
ఈ స్త్రీలు స్వేచ్ఛగా తిరగడాన్ని చూసి
వాళ్ళని అసహ్యించుకుంటారు.



దియా విఘ్నేష్

# ధర్నా చౌక్‌లో మహాధర్నాలో బీజేపీ నిరసన

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా రాంచెందర్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి ప్రజలను మోసం చేసిన చరిత్ర ఉందన్నారు. పేదరిక నిర్మూలన నినాదాల నుంచి నిరుద్యోగ హామీల వరకు, గ్యారంటీల పేరుతో ఇచ్చిన వాగ్దానాల వరకు అన్నీ మాటలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో గొప్ప హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడమే కాంగ్రెస్ నైజమని ఆరోపించారు. తెలంగాణలో కూడా అదే మోసపూరిత రాజకీయాలు కొనసాగుతున్నాయని అన్నారు.
పునరావృత హామీలు ఇచ్చినప్పటికీ రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన ప్రయోజనాలు విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన తెలిపారు. వేతన సవరణ కమిషన్ అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రభుత్వానికి జీవితాంతం సేవ చేసిన ఉద్యోగులు తమ హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.
దేశంలోనే ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి, ఆర్థిక అవ్యవస్థకు నిదర్శనమని రాంచెందర్ రావు మండిపడ్డారు. ఈ అన్యాయాన్ని ఉద్యోగులు, పెన్షనర్లు సహించరని, రోడ్లపై కనిపిస్తున్న ఆగ్రహమే కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరికగా మారుతుందని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని ఆయన హెచ్చరించారు.




# గంజాయి ముఠాలకు ప్రభుత్వ భయం లేదు -కవిత

(మొదటి పేజీ తరువాయి)

ఆ తరువాత మీడియాతో మాట్లాడిన కవిత మాట్లాడుతూ, ఒక ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను చంపే స్థాయికి గంజాయి ముఠాలు వెళ్లాయంటే ప్రభుత్వంపై వారికి ఏ మాత్రం భయం లేదని స్పష్టమవుతోందని తీవ్రంగా విమర్శించారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేస్తూ, ప్రస్తుతం గ్రామాల్లో కూడా స్వేచ్ఛగా గంజాయి, మత్తు పదార్థాలు లభిస్తున్న పరిస్థితి ఏర్పడిందని అన్నారు.
పాఠశాలల వరకు గంజాయి, డ్రగ్స్ చొరబడటం అత్యంత ప్రమాదకరమని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులను మత్తుకు బానిసలుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీని ప్రభావం సమాజం మొత్తం మీద పడుతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాల కారణంగా మహిళలే ఎక్కువగా బాధితులుగా మారుతున్న పరిస్థితి ఉందని చెప్పారు.
గృహహింస ఘటనలు పెరగడానికి కూడా గంజాయి, డ్రగ్స్ ప్రధాన కారణమవుతున్నాయని కవిత పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మత్తు వదిలి గంజాయి, డ్రగ్స్ మాఫియాపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎక్సైజ్, అటవీ శాఖ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణలో గన్ ఫైరింగ్ నేర్పుతున్నప్పటికీ ఆయుధాలు ఇవ్వకపోవడం అన్యాయమని, సిబ్బంది వద్ద ఆయుధాలు ఉంటే గంజాయి, డ్రగ్స్ మాఫియాకు కొంతైనా భయం ఏర్పడుతుందని స్పష్టం చేశారు.



# గంజాయి ముఠా దాడిలో గాయపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి విషమం

హైదరాబాద్, జనవరి 27 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):




నిజామాబాద్ జిల్లాలో గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కారుతో ఢీకొట్టబడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. హైదరాబాద్‌లోని నిమ్స్ వైద్యులు విడుదల చేసిన తాజా ఆరోగ్య బులిటెన్‌లో ఆమెకు తీవ్ర అంతర్గత గాయాలు ఉన్నట్లు తెలిపారు. వైద్యుల వివరాల ప్రకారం, కారు కడుపు పైభాగానికి బలంగా ఢీకొట్టడంతో లివర్, కిడ్నీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పక్కటెముకలు విరిగిపోయాయి. ప్రాణాపాయం దృష్ట్యా ఎడమ కిడ్నీని తొలగించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నప్పటికీ చికిత్సకు సహకరిస్తున్నారని వైద్యులు తెలిపారు. ఐసీయూలో ఉంచి నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని, రక్తనాళాలు, శ్వాసకోశ వ్యవస్థలపై కూడా ప్రభావం పడినట్లు పేర్కొన్నారు. మరిన్ని పరీక్షలు, చికిత్సలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నిజామాబాద్ జిల్లాలో వాహనాల తనిఖీలు చేపడుతున్న సమయంలో గంజాయి ముఠా సభ్యులు కారుతో సౌమ్యను ఢీకొట్టారు. తీవ్ర గాయాలపాలైన ఆమెను తొలుత జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎక్సైజ్ శాఖ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణా పెరుగుతున్న నేపథ్యంలో ఈ దాడి ప్రభుత్వానికి, పోలీసు శాఖకు గట్టి హెచ్చరికగా మారిందని అధికారులు పేర్కొన్నారు. సౌమ్య త్వరగా కోలుకుని మళ్లీ విధులకు హాజరవ్వాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ఈ ఘటనతో మత్తు పదార్థాల అక్రమ రవాణాపై మరింత కఠిన చర్యలు అవసరమన్న చర్చకు తెరలేచింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ఎదుట సంతోష్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ లను సిట్ అధికారులు విచారించారు. వారి వాంగ్మూలాలను నమోదు చేసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నేతల విచారణ కొనసాగుతుండటంతో రాష్ట్ర రాజకీయాల్లో ఈ వ్యవహారం మరింత చర్చనీయాంశంగా మారింది. సిట్ దర్యాప్తు తదుపరి దశలో ఎలాంటి అంశాలు వెలుగులోకి వస్తాయన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.



# మల్కాజిగిరి పరిధిలో రైల్వే అభివృద్ధికి శ్రీకారం

- **రూ.80.47 కోట్లతో కీలక రైల్వే పనులకు శంకుస్థాపన**
- **వాజ్‌పేయి నగర్‌లో ఆర్‌యూబీ నిర్మాణం**
- **సఫీల్‌గూడలో పరిమిత ఎత్తు సబ్వే ఏర్పాటు**
- **ప్రజల చిరకాల కోరిక నెరవేరిందన్న ఈటల రాజేందర్**

హైదరాబాద్, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రజల చిరకాల కోరిక నెరవేరుస్తూ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టనున్న పలు రైల్వే అభివృద్ధి పనులకు నేరెడ్‌మెట్ రైల్వే స్టేషన్ వద్ద శంకుస్థాపన చేయడం ఎంతో సంతోషకరమని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మొత్తం రూ.80.47 కోట్ల వ్యయంతో ఈ పనులు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాజ్‌పేయి నగర్‌లో ఉన్న లెవెల్ క్రాసింగ్ గేట్ (బీపీ నం. 8) స్థానంలో రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే సఫీల్‌గూడ రైల్వే స్టేషన్ సమీపంలో పరిమిత ఎత్తు సబ్వే నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని, ప్రజలకు రాకపోకలు మరింత సులభమవుతాయని ఎంపీ వివరించారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ డా. ఆర్. గోపాల కృష్ణ, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ కే. ముత్యాల నాయుడు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు హాజరయ్యారు.
మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇలాంటి మరిన్ని ప్రాజెక్టులు తీసుకొస్తామని ఈటల రాజేందర్ తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# దివ్యాంగుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: భట్టి విక్రమార్క

- **మధిరలో దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ**
- **రెండేళ్లలో రూ.100 కోట్లతో సంక్షేమ చర్యలు**
- **విద్యార్థులకు ఐప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు**
- **ప్రతి అడుగులో ప్రభుత్వం తోడుగా ఉంటుందన్న భరోసా**

మధిర, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):

మధిర నియోజకవర్గ కేంద్రంలో దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేసినట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలోనే దివ్యాంగుల సంక్షేమం కోసం సుమారు వంద కోట్ల రూపాయలను ఖర్చు చేసినట్లు వెల్లడించారు. దివ్యాంగ విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తోందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఐప్యాడ్లు, ల్యాప్‌టాప్‌లు అందజేస్తూ వారి విద్యాభ్యాసానికి అండగా నిలుస్తున్నామని చెప్పారు. అంగవైకల్యం ఎదుగుదలకు అడ్డంకి కాకూడదని, దివ్యాంగులను సమాజంలో మనతో సమానంగా గౌరవప్రదమైన స్థితిలో నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
దివ్యాంగులకు సంబంధించిన అన్ని రకాల సంక్షేమ పథకాలు సక్రమంగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. అవసరమైన ప్రతి సందర్భంలో దివ్యాంగుల పక్షాన ప్రభుత్వం నిలుస్తుందని, వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు కొనసాగిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, దివ్యాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ చర్యలతో తమ జీవితం మెరుగుపడుతోందని దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేశారు.

## జీహెచ్ఎంసీ మెగా స్పెషల్ పారిశుధ్య డ్రైవ్

(మొదటి పేజీ తరువాయి)


క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ, విభాగాల మధ్య సమన్వయంతో నగర వ్యాప్తంగా పారిశుధ్య చర్యలు వేగంగా అమలవుతున్నాయి.
ఈ డ్రైవ్‌లో భాగంగా అంబర్‌పేట, కవాడిగూడతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. స్థానిక నివాసితులతో నేరుగా మాట్లాడి పారిశుధ్యానికి సంబంధించిన అవసరాలు, సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టారు. ప్రజల భాగస్వామ్యంతో పరిసరాల్లో స్పష్టమైన మార్పులు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు. ప్రజా మరుగుదొడ్ల సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రత లేని, వినియోగంలో లేని నిర్మాణాలను తొలగిస్తూ, పరిశుభ్రత ప్రమాణాలు పెంచే చర్యలు చేపట్టారు. మరుగుదొడ్ల చుట్టుపక్కల శుభ్రత, మొక్కల నాటకం వంటి కార్యక్రమాలు నిర్వహించి పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చారు.



నిరంతర పర్యవేక్షణ, ప్రజల సహకారంతో నగరమంతా శుభ్రత, ప్రజా ఆరోగ్యం బలోపేతం చేయడమే లక్ష్యమని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేశారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, నివసించదగిన హైదరాబాద్ కోసం ఈ మెగా పారిశుధ్య డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు.

# పారదర్శకంగా మునిసిపల్ ఎన్నికల నిర్వహణ..



**రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**

**ఖమ్మం బ్యూరో, జనవరి - 27(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పారదర్శక నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డిజిపి శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల అదనపు కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయినప్పటి నుండి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని, నామినేషన్ ప్రక్రియ, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాలు, జోనల్, నోడల్ అధికారులు, పర్యవేక్షణ బృందాలు, పిఓ లు, ఎపిఓ లు, ఎన్నికల సిబ్బంది నియామకం ప్రతి అంశంలో జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని, ఎన్నికల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఎన్నికలలో వినియోగించే బ్యాలెట్ బాక్సులు, సామాగ్రి, బ్యాలెట్ ప్రింటింగ్ కు అవసరమైన ఏర్పాట్లు, నామినేషన్ స్వీకరణ కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా పర్యవేక్షించాలని, స్వేచ్ఛగా, నిర్భయంగా ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు అవసరమైన పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ కు హాజరైన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ, జిల్లాలో 5 మునిసిపాలిటీలు ఏదులాపురం, కల్లూరు, మధిర, వైరా, సత్తుపల్లి పరిధిలో 117 వార్డులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించేందుకు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా వెబ్ కాస్టింగ్, నోడల్ అధికారులు, జోనల్ అధికారులు, రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులు, పిఓ లు, ఓపిఓల నియామకం, శిక్షణ, ఎన్నికల సామాగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని, అధికారుల సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా ఉపాధి అధికారి శ్రీరామ్, సిపిఓ శ్రీనివాస్, డిపిఓ రాంబాబు, ఆర్టిఓ జగదీష్, డిసిఓ గంగాధర్, మునిసిపల్ కమిషనర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల సంక్షేమానికి 100 కోట్లు ఖర్చు చేశాం..





◆ **రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు**

**ఖమ్మం బ్యూరో, జనవరి 27(తెలంగాణ ముచ్చట్లు):** దివ్యాంగుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత ప్రభుత్వం పదేళ్ళలో చేయలేని పనులని, ఈ ప్రభుత్వం రెండేళ్లలోనే చేసిందని, అందులో భాగంగానే ఈ రెండేళ్లలో దివ్యాంగుల కోసం 100 కోట్ల రూపాయలని ప్రభుత్వం ఖర్చు చేసిందని రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. బుధవారం మధిర నియోజకవర్గ కేంద్రంలో డిప్యూటీ సీఎం, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ

చదువుకుంటున్న దివ్యాంగులకు ఐపాడ్లు, కంప్యూటర్లు ట్యాబ్స్ ప్రజా ప్రభుత్వం అందిస్తోందన్నారు. తమది ప్రజల గురించి ఆలోచన చేసేటువంటి ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వమని అన్నారు. దివ్యాంగులకు ఎటువంటి సమస్యలు రాకుండా చూస్తామని, వారికి అవసరమైన అన్ని సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని అన్నారు.

దురదృష్టవశాత్తు అంగవైకల్యంతో పుట్టిన వారిని కూడా సమాజంలో మనతో పాటు ముందుకు నడిపించాల్సిన బాధ్యత మనందరి పైన ఉంది, దివ్యాంగుల గురించి సమాజంలో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని అన్నారు. దివ్యాంగులు కూడా అన్ని రంగాలలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. సమాజంలో ఇతరులు కన్నా ఎక్కువ అవకాశాలను, ఆసరాను దివ్యాంగులకు మనం అందించాలని అన్నారు.

అంగవైకల్యంతో ఉన్నామన్న బాధ వారికి రాకుండా వారిని ప్రోత్సహించి ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఈ ఆలోచన దిశగానే ముందుకు సాగుతోందని అన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఇర్రిగేషన్ ఎస్ఇ వాసంతి, విద్యుత్ ఎస్ఇ శ్రీనివాస చారి, ఆర్ అండ్ ఎస్ఇ యాకుబ్, జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహారావు, వ్యవసాయ శాఖ ఏడి విజయ చందర్, మధిర తహసీల్దార్ రాంబాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# 15వ బెటాలియన్ సిబ్బంది సమస్యలపై ఎమ్మెల్యేలను కలిసిన కమిటీ సభ్యులు





**సత్తుపల్లి, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి మండలం, బి గంగారం 15వ బెటాలియన్‌కు చెందిన సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై కమిటీ సభ్యులు కొత్తగూడెం నియోజకవర్గ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 15వ బెటాలియన్ సిబ్బంది ఎదుర్కొంటున్న జోనల్ సమస్యలు, బదిలీ విధానం, పదోన్నతులు, మహబూబాబాద్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించిన పీసీల ఏఆర్ జాబితాలో ఖాళీలు, అలాగే ఆదిలాబాద్, ఉమ్మడి వరంగల్ తదితర జిల్లాల నుంచి దూర ప్రయాణం చేస్తూ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఇబ్బందులను కమిటీ సభ్యులు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందిస్తూ, ముఖ్యమంత్రి తో చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైతే ప్రభుత్వ ఉత్తర్వుల్లో మార్పులపై కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఈ భేటీలో యు. భూమరాజు, బి. నాగేశ్వరరావు, జె. విజయ కుమార్, బి. రవి, పెద్ది ప్రసాద్ పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



**భీమదేవరపల్లి, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఇటీవల అనారోగ్యానికి గురైన భీమదేవరపల్లి మండలం కొప్పూర్ గ్రామానికి చెందిన కొమ్ముల అనిత భర్త రాజుకు తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును స్థానిక నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా రూ.82,000 విలువైన చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సహాయ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొప్పూర్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మండ సమ్మయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు తూముల రాజమౌళి, గడిపే శ్రీకాంత్, చుంచు సతీష్, గడిపే ప్రశాంత్, గడిపే ఐలయ్య, కొమ్ముల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు



**భీమదేవరపల్లి,జనవరి27 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన సుంచు రామ్ చరణ్ (23) ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయిన నేపథ్యంలో ఇటీవల మృతి చెందిన ఘటనపై జేఏసీ, డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మంగళవారం గ్రామానికి వెళ్లిన నాయకులు, మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ కోఆర్డినేటర్ దేగల సారయ్య మాట్లాడుతూ, భవిష్యత్తు ఉన్న యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయి మృతి చెందడం బాధాకరమని తెలిపారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ ఆటలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే డ్రగ్స్ వినియోగం వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయని, ఇలాంటి అలవాట్లను విడిచిపెట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరస్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్ నియంత్రణలో ప్రభుత్వం మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. మృతుడి కుటుంబంలో గతంలో కోడలు, కుమారుడు అనారోగ్య కారణాలతో మృతి చెందగా, తాజాగా మనవడిని కోల్పోయిన మధురమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని నాయకులు అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ, డ్రగ్స్ నిర్మూలన పోరు యాత్ర నాయకులు గాండ్ల పద్మ, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, మాట్ల వెంకటస్వామి, వేముల జగదీష్, దస్తరి ఉమామహేశ్వర్, రేణికుంట్ల బిక్షపతి, వార్డు సభ్యులు సుంచు చంద్రమౌళి, ముదిరాజ్ సంఘం డైరెక్టర్ సుంచు రాంబాబు, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి-మల్కాజిగిరి మార్గంలో ఎంఎంటీఎస్ రైళ్లు నడపాలని ఎంపీ ఎమ్మెల్యేకి వినతి

◆ **యూసీసీ సభ్యుడు నూర్**



**నేరెడిమేట్, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి నియోజకవర్గం నేరెడిమేట్‌లో దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న రోడ్ అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) పనులకు, అలాగే సఫిల్‌గూడ వద్ద నూతన సబ్‌వే నిర్మాణానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా యూసీసీ సభ్యుడు నూర్, డీఆర్‌యూసీసీ సభ్యుడు భరద్వాజ్, అనిత చావళి కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలను కలసి వినతిపత్రం సమర్పించారు. మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచేలా చర్యలు తీసుకోవాలని, గౌతమ్‌నగర్ వద్ద నూతన ఆర్‌యూబీ నిర్మించాలని వారు కోరారు.

అలాగే చర్లపల్లి నుంచి మల్కాజిగిరి మీదుగా ఎంఎంటీఎస్ రైళ్లు నడపాలని, ఆనంద్‌బాగ్, లయోలా కాలేజ్, ఉప్పరగూడ ప్రాంతాల్లో నూతన ఎంఎంటీఎస్ స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి రైల్వే శాఖకు పంపిన ప్రతిపాదనలను ఆమోదింపజేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యేలు మరియు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డీఆర్‌ఎం గోపాలకృష్ణన్‌ను నూర్ మరియు భరద్వాజ్ శాలువా, మోమెంటోతో సత్కరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కీసరలో 'అరైవ్ అలైవ్-2026' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం







**కీసర, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'అరైవ్ అలైవ్-2026' ప్రాజెక్టు మరియు డీజీపీ బి. శివధర్ రెడ్డి మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా కీసర పోలీస్ శాఖ విస్తృత స్థాయి రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది.ఈ కార్యక్రమాన్ని కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు, ఎస్ఐలు హరి ప్రసాద్, నాగరాజు ఆధ్వర్యంలో మహిళా సంఘాల సహకారంతో కీసర గ్రామంలో నిర్వహించారు.కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు.ప్రమాదాలు ఎలా జరుగుతున్నాయి, అధిక వేగం, హెల్మెట్ ధరించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి నిర్లక్ష్యాల వల్ల ఎదురయ్యే నష్టాలు, వైద్య ఖర్చులు, జీవితాంతం కొనసాగే శారీరకమానసిక వేదనలు, కుటుంబంపై పడే ఆర్థిక, భావోద్వేగ ప్రభావాలను వారు వివరించారు.అనంతరం నిర్వహించిన ఇంటరాక్షన్ సెషన్‌లో ప్రజలు తమ సందేహాలను వ్యక్తపరచగా, పోలీసు అధికారులు ట్రాఫిక్ నిబంధనలు, సురక్షితంగా వాహనం నడిపే విధానం, ప్రమాదం జరిగిన వెంటనే తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న ప్రతిఒక్కరూ తమ కుటుంబ సభ్యులు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించేలా ప్రోత్సహిస్తామని రోడ్డు భద్రతా ప్రతిజ్ఞ చేశారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు రోడ్డు ప్రమాదాల నివారణకు ఎంతో ఉపయోగపడతాయని, ప్రజలందరూ పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి ఆంజనేయులు కోరారు.

# కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండి..






◆ **విద్యార్థులకు కార్పొరేటర్ రజితా పరమేశ్వర్‌రెడ్డి పిలుపు**

**ఉప్పల్, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులు పెద్ద పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు పట్టుదలతో చదవాలని ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇదే విషయాన్ని మహానుభావుడు డా. ఏపీజే అబ్దుల్ కలాం కూడా తన జీవితకాలంలో పేర్కొన్నారని ఆమె గుర్తు చేశారు.ఉప్పల్‌లోని సాగర్ గ్రామర్ స్కూల్‌లో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా రజితా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, నేటి సమాజంలో అన్ని రంగాల్లో పోటీ తీవ్రంగా పెరిగిందని, ఆ పోటీలో ముందుండాలంటే విద్యార్థులు కష్టపడి చదవాలని సూచించారు. మనం పోటీ పడాల్సింది కేవలం దేశంలోనే కాకుండా ప్రపంచంతోనని, అందుకు మీలాంటి విద్యార్థులే సిద్ధంగా ఉండాలని ఆమె అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.ఒకప్పుడు విద్య కొందరికే పరిమితమై ఉండేదని, నేడు అందరికీ విద్య అందుబాటులోకి తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలకే దక్కుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సాగర్ గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ బట్కిరి ధన్సాగర్, స్వప్న, గౌరిగే మల్లేష్, సల్లా ప్రభాకర్, మంద సుమన్ రెడ్డి, పూజల హనుమత్, రఘు గుప్తా, ప్రశాంత్ రెడ్డి, బాబీ, రంగుల శేఖర్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# శుభోదయ నగర్ కాలనీ లో 'అరైవ్ అలైవ్-2026' రోడ్డు భద్రత ప్రతిజ్ఞ





**కుషాయిగూడ, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ డివిజన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో 'అరైవ్ అలైవ్-2026' కార్యక్రమంలో భాగంగా శుభోదయ నగర్ కాలనీ ఫేజ్-3లో మంగళవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు.కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కుషాయిగూడ ఏసీపీ వై. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ముఖ్యంగా నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం ప్రధాన కారణమని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, సీట్‌బెల్ట్ ఉపయోగించాలి, మద్యం సేవించి వాహనం నడపరాదని ప్రజలకు సూచించారు. 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా క్యాంపెయిన్‌ను నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. కుషాయిగూడ ఇన్స్పెక్టర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించినప్పుడే ప్రజల మద్దతుతో ప్రమాదాలను తగ్గించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటిస్తామని కాలనీ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో కుషాయిగూడ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, శుభోదయ కాలనీ మాజీ అధ్యక్షులు నందన్ గౌడ్, అధ్యక్షులు తిగుళ్ల రామచందర్, ప్రధాన కార్యదర్శి బలగం మల్లేష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కె. సిద్ధు, రాములు, కోశాధికారి పి. కృష్ణ, ఉప కోశాధికారి ఎన్. బాలరాజు, కార్యవర్గ సభ్యులు ఎన్. బాలరాజ్ గౌడ్, ఎస్. శ్రీకాంత్, ఎన్. రమేష్, భాను నేత, కాలనీ పెద్దలు రమేష్ బాబు, యాదయ్య గౌడ్, బల్ల ప్రసాద్, వరికుప్పల వెంకటయ్య, మహిళా కమిటీ సభ్యులు రమాదేవి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# అన్ని పీఏసీల్లో ప్రతి నెల జనరల్ ఫిజీషియన్ (ఓపి)ను ఏర్పాటు చేయాలి



◆ **మంత్రి తుమ్మలకు 25వ డివిజన్ కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకట్ ల వినతి**

**ఖమ్మం బ్యూరో, జనవరి 27(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం నగరంలోని అన్ని పీఏసీల్లో జనరల్ ఫిజీషియన్ ఓపి ను ఏర్పాటు చేయాలని ఖమ్మం కార్పొరేషన్ 25వ డివిజన్ కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వెంకట్ లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం స్థానిక 36 వ డివిజన్ నందు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ వినతి పత్రం అందజేసి నగరంలోని అన్ని పీఏసీల్లో నెలకు ఒకసారి జనరల్ ఫిజీషియన్ సౌకర్యం ఉండేలా చూడాలని ఆమె కోరారు. వెంటనే స్పందించిన మంత్రి తుమ్మల దీన్ని అమలు చేసే విధంగా చూడాలని డిఎంహెచ్ఓ, మున్సిపల్ కమిషనర్ కు సూచించారు. అదేవిధంగా 25వ డివిజన్ లో ఎంతోమంది వృద్ధాప్య పెన్షన్ రాక ఇబ్బంది పడుతున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ మంజూరు అయ్యేలా చూడాలని డివిజన్లోని పలు సమస్యలను మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు కార్పొరేటర్ గోళ్ళ చంద్రకళ

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**కీసర, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** కీసర మరియు రాంపల్లి దయారా సబ్ స్టేషన్ల పరిధిలో బుధవారం నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో నిర్ణీత సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కీసర విద్యుత్ శాఖ ఏఈ ఎస్. మురళీ కృష్ణ తెలిపారు.కీసర సబ్ స్టేషన్ పరిధిలోని 11 కె.వి కీసర టౌన్, చీర్యాల లక్ష్మి, వర్ధన, అంకిరెడ్డిపల్లి, కలెక్టర్ ఆఫీస్, బోగారం ఫీడర్లలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ సమయంలో కీసర గ్రామం, ఎస్సీ కాలనీ, రెడ్డి కాలనీ, శివాజీ నగర్, కుందన్‌పల్లి, గోడుమకుంట, అంకిరెడ్డిపల్లి, నూకలగూడెం, రెడ్డిగూడెం, బోగారం తదితర ప్రాంతాలు ప్రభావితమవుతాయని తెలిపారు.అలాగే రాంపల్లి దయారా సబ్ స్టేషన్ పరిధిలోని 11 కె.వి రాంపల్లి దయారా, కరీంగూడ ఏజీఎల్, బార్షిగూడ, వన్నిగూడ ఏజీఎల్, వన్నిగూడ ఇండస్ట్రియల్ ఫీడర్లలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో రాంపల్లి దయారా, జాఫర్‌గూడ, తుర్కా దయారా, బార్షిగూడ, బోగారం, కుందన్‌పల్లి, వన్నిగూడ, కాపుగూడతో పాటు పలు పరిశ్రమలు మరియు కాలనీలు ప్రభావితమవుతాయని తెలిపారు.విద్యుత్ సబ్ స్టేషన్ నిర్వహణ పనులు పూర్తయిన వెంటనే సరఫరా పునరుద్ధరిస్తామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని విద్యుత్ శాఖ అధికారులు కోరారు.

# వైరా 13వ వార్డుకు దరఖాస్తును సమర్పించిన... కాంగ్రెస్ పార్టీ నాయకురాలు.. దుర్గ భవాని



**ఖమ్మం బ్యూరో, జనవరి 27(తెలంగాణ ముచ్చట్లు):** వైరా మున్సిపాలిటీ 13వ వార్డు కాంగ్రెస్ పార్టీ మహిళా అభ్యర్థి గా వీరంశెట్టి దుర్గా భవాని భర్త వీరంశెట్టి సీతారాములు దరఖాస్తు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమర్పించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు , నార్పనేనిపల్లి సర్పంచ్ శీలం చంద్రశేఖర్ రెడ్డి మరియు గ్రంధి ప్రవీణ్, మిట్టపల్లి శ్రీనివాసరావు, కొణతం రాజారావు మురిసెట్టి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఎస్సై గా ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను అభినందించిన సీపీ



**ఖమ్మం బ్యూరో, జనవరి 27(తెలంగాణ ముచ్చట్లు):** వివిధ పోలీస్ స్టేషన్ లలో హెడ్ కానిస్టేబుల్ గా నిరంతరంగా సేవలందించి ఏఎస్సై గా ఉద్యోగన్నతి పొందిన పోలీస్ అధికారులను పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి, అభినందనలు తెలియజేశారు. ఏఎస్సై గా పదోన్నతి పొందిన వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు.వరంగల్ జిల్లా కు ఒకరు, మహబూబాబాద్ జిల్లా కు ముగ్గురు బదిలీపై వెళ్ళనున్నారు. పదోన్నతి పొందిన వారిలో...బి. వాస్య,సిహెచ్. శ్రీనివాస్ రావు, ఎస్.కె కరీముద్దిన్, పి. లక్ష్మి వున్నారు.

# రేషన్ డీలర్ల డిమాండ్ల పరిష్కారానికి చొరవ తీసుకుంటా: ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా హస్తినాపురం డివిజన్ పరిధిలోని కేకే గార్డెన్ ఫంక్షన్ హాల్లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని రేషన్ డీలర్ల సమస్యలపై మాట్లాడారు.ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సుమారు 17,200 మంది రేషన్ డీలర్లు పనిచేస్తున్నారని తెలిపారు. దేశ జనాభాలో దాదాపు 85 శాతం కుటుంబాలతో రేషన్ డీలర్లకు నేరుగా సంబంధం ఉంటుందని, అయినప్పటికీ ప్రభుత్వాలు రేషన్ డీలర్ల పట్ల తగిన ప్రాధాన్యం చూపడం లేదని విమర్శించారు.రేషన్ డీలర్లు చేసిన తొమ్మిది డిమాండ్లలో అన్నింటినీ ఒకేసారి నెరవేర్చడం సాధ్యం కాకపోయినా, కనీసం ఐదు నుంచి ఆరు డిమాండ్లను తప్పకుండా అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఒక్క వ్యక్తికి ఐదు కిలోల బియ్యం అందిస్తే, రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఒక్క కిలో మాత్రమే ఇస్తోందని పేర్కొన్నారు. రేషన్ డీలర్లకు కమిషన్లు పెంచాలని, నెలసరి విధానంలో జీతాలు చెల్లించే వ్యవస్థను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నైకోటి రాజు, జనరల్ సెక్రటరీ ఆవుల సంజీవ రెడ్డి, కోశాధికారి పారేపల్లి నాగరాజు, నూతనంగా ఎన్నికైన వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం మల్లికార్జున్ గౌడ్, రాష్ట్ర నాయకులు నందయ్య, అమూర ఇంద్రసేన రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోకొండ వైకుంఠం, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పుస్తె శ్రీకాంత్, మురళీ మోహన్, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి, సామ రంగారెడ్డి, హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు ఎరుకల మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాప్రా సర్కిల్ కార్యాలయంలో కార్మికులకు మెగా హెల్త్ క్యాంప్




- **350 మందికి వైద్య పరీక్షలు**

**కాప్రా, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు, కార్యాలయ సిబ్బందికి ఉద్దేశించి మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో దాదాపు 350 మంది కార్మికులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా ఇండియన్ క్యాన్సర్ సొసైటీ సహకారంతో, కర్కినోస్ హెల్త్ కేర్ - హైదరాబాద్ వారి సౌజన్యంతో సుమారు 150 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.
అలాగే లైఫ్ లైన్ తులసి హాస్పిటల్, ఈసీఐఎల్ ఎక్స్ రోడ్ వారి సహకారంతో షుగర్, బీపీ, థైరాయిడ్, ఆర్థో వంటి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ జోత్స్న వైద్య సేవలు అందించారు .ఈ కార్యక్రమాన్ని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీ.ఎం.ఓ.హెచ్ డాక్టర్ పద్మజ, ఏఎంఓహెచ్ డాక్టర్ మమత, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డీఈ కాపురం రవి, డీఈ బాలకృష్ణ, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్య సంరక్షణకు ఇలాంటి హెల్త్ క్యాంపులు ఎంతో ఉపయోగపడతాయని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన వెల్టూర్ గ్రామ నాయకులు





**పెద్దమందడి,జనవరి27(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవానికి హాజరైన జిల్లా ఎస్పీ సునీత రెడ్డిని వెల్టూర్ గ్రామ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. గ్రామస్తుల సహకారంతో ప్రధాన చౌరస్తాల్లో అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో పోలీసు శాఖ మార్గదర్శకత్వం అందించడం అభినందనీయమని తెలిపారు.జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ, పోలీసు శాఖ-ప్రజల మధ్య సమన్వయం బలపడితేనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, సీసీ కెమెరాల ఏర్పాటు ఈ దిశగా మంచి ముందడుగని ఆమె అన్నారు.గ్రామాభివృద్ధి, భద్రత అంశాల్లో పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని గ్రామ నాయకులు జిల్లా ఎస్పీకి భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వెల్టూర్ సర్పంచ్ అశోక్, మాజీ సర్పంచ్ బాలచంద్రయ్య, మాజీ వైస్ ఎంపీపీ సాక వెంకటయ్య, కొత్తకోట సీఐ రాంబాబు, పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి, గ్రామ నాయకులు , గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వాజపేయి నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి, సఫిల్‌గూడ సబ్‌వే పనులకు శంకుస్థాపన






- **రూ.81 కోట్లతో పనులు – రెండేళ్లలో పూర్తి చేస్తాం : ఎంపీ ఈటల రాజేందర్**

**నేరేడ్మెట్, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మల్కాజ్గిరి నియోజకవర్గం నేరేడ్మెట్ డివిజన్ లో వాజపేయి నగర్ రైల్వే అండర్ బ్రిడ్జి, సఫిల్‌గూడ సబ్‌వే నిర్మాణ పనులకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, రైల్వే అధికారులు పాల్గొన్నారు. రూ.81 కోట్ల వ్యయంతో ఈ కీలక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు .ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ...తాను మంత్రిగా ఉన్న సమయంలో హుజురాబాద్ నియోజకవర్గంలో రూ.800 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. అప్పట్లో రైల్వే పట్టాలపై నిర్మించే ఒక బ్రిడ్జికి కేవలం రూ.6 కోట్లు మాత్రమే రైల్వే శాఖ ఇచ్చిందన్నారు. కేంద్ర-రాష్ట్ర నిధుల నిబంధనల కారణంగా అనేక రైల్వే బ్రిడ్జి పనులు తీవ్ర జాప్యానికి గురయ్యాయని తెలిపారు.2014లో మల్కాజిగిరిలో శిలాఫలకం వేసిన బ్రిడ్జి ఇప్పటికీ పూర్తి కాలేదని విమర్శించారు. రోజుకు 50 వేల కార్లు ప్రయాణించే చోటే బ్రిడ్జి అవసరం ఉంటే, 10 లక్షల కార్ల ట్రాఫిక్ ఉన్న ప్రాంతాల్లో కూడా బ్రిడ్జులు నిర్మించకపోవడం దురదృష్టకరమన్నారు.
2022లో ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న కీలక నిర్ణయం వల్ల రైల్వే ప్రాజెక్టులకు పూర్తి నిధులు రైల్వే శాఖే భరిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రాల సహకారం లేకపోవడం వల్లే అనేక ప్రాజెక్టులు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారని వివరించారు. 1993లో బొల్లారంలో శంకుస్థాపన చేసిన బ్రిడ్జి పనులు 33 ఏళ్లయినా ప్రారంభం కాలేదని తెలిపారు. ఎంఎంటీఎస్ రైల్వే లైన్‌కు రూ.1043 కోట్ల వ్యయ ప్రతిపాదనలో రాష్ట్రం చెల్లించాల్సిన రూ.400 కోట్లు ఇవ్వకపోవడంతో, మొత్తం నిధులు రైల్వే శాఖే భరించి ప్రాజెక్టు పూర్తి చేసిందన్నారు.
తాను ప్రధానికి లేఖ రాయడం, నాలుగు సార్లు కమిటీ సమావేశాలు నిర్వహించడం ద్వారా రైళ్ల వేగం, ఫ్రీక్వెన్సీ పెరిగాయని చెప్పారు. హైదరాబాద్‌లో ప్రజలు, పశువులు రైల్వే పట్టాలపైకి రాకుండా ఉండేందుకు 100 ప్రాంతాల్లో అండర్‌పాస్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు.రాష్ట్రంలో చిన్న పనులకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి ఉందని, ఇది రాష్ట్ర ప్రభుత్వ దుస్థితికి నిదర్శనమని విమర్శించారు. తాను ప్రజల కోణంలోనే పని చేస్తానని, అధికారంలో ఎవరు ఉన్నారన్నది తనకు ముఖ్యం కాదన్నారు.జిహెచ్ఎంసీ సమావేశాల్లో మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన 45 మంది కార్పొరేటర్లకు నిధులు మంజూరు చేయడం తన బాధ్యతగా తీసుకుని, తన జోక్యంతో రూ.4 వేల కోట్ల నిధులు సాధించామని తెలిపారు. చిన్న పనికైనా దరఖాస్తు పట్టుకుని వెళ్లడం తన నైజమన్నారు.పదవులు శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యమే శాశ్వతమని స్పష్టం చేశారు. తాను కులం, మతాలకు అతీతంగా ప్రజలే తన హైకమాండ్, ప్రజలే తన దేవుళ్లని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సూచించిన అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రూ.81 కోట్లతో చేపట్టిన ఈ బ్రిడ్జి పనులను రెండేళ్లలో పూర్తి చేయిస్తామని, ఇవన్నీ ప్రజలకు ఉపయోగపడే శుభకార్యాలేనని అన్నారు. సభలు బలప్రదర్శనకు వేదికలు కాకూడదని, పరస్పర గౌరవంతో ప్రజాస్వామ్యం పరిపుష్టి చెందాలని సూచించారు. కంటోన్మెంట్ ప్రాంతంలో కూడా ప్రజలకు ఇబ్బందులు లేకుండా రక్షణ మంత్రితో చర్చిస్తామని తెలిపారు.

# స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు...

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
- **మునిసిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను వెల్లడించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం బ్యూరో జనవరి- 27(తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో మునిసిపల్ ఎన్నికలు స్వేచ్ఛ, న్యాయబద్ధంగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. రాష్ట్రంలో 7 మునిసిపల్ కార్పొరేషన్లు, 116 మునిసిపాలిటీలలో ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమీషన్ మంగళవారం నోటిఫికేషన్ జారీచేసినట్లు కలెక్టర్ తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలోని 5 మునిసిపాలిటీలు (ఏదులాపురం, వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి) లలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.
ఎన్నికలు జరగనున్న 5 మునిసిపాలిటీల్లో ఎలక్టోరోల్ సంబంధ 417 అభ్యంతరాలు రాగా, అన్నిటినీ పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని 5 మునిసిపాలిటీల్లో 117 వార్డులు ఉన్నట్లు, 242 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుచేసినట్లు తెలిపారు. సత్తుపల్లి మునిసిపాలిటిలో 28830, మధిరలో 25679, వైరా లో 24689, ఏదులాపురంలో 45256, కల్లూరు మునిసిపాలిటీలో 18866 మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకొనున్నట్లు తెలిపారు.
ఎన్నికల నిర్వహణకు 55 మంది ఆర్వో లు, 55 మంది ఏఆర్వో లు, 291 మంది పిఓ లు, 948 మంది ఓపిఓ లు, 26 మంది జోనల్ అధికారులు, 10 ఫ్లయింగ్ స్క్వాడ్, 10 ఎస్ఎస్టి టీములు సిద్ధం చేశామన్నారు. ఎన్నికల ఖర్చు నిఘాకు 5 గురు వ్యయ పరిశీలకులను , 2 సభ్యుల అకౌంటింగ్ టీములతో నియమించామన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిషిప్షన్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను గుర్తించి, అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణకు ఏదులాపురం మునిసిపాలిటీలో 13, కల్లూరు లో 7, మధిర లో 8, సత్తుపల్లి లో 8, వైరా మునిసిపాలిటీలో 7 మొత్తం 43 నామినేషన్ స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ కేంద్రాల్లో, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఏదులాపురానికి 166, కల్లూరు కు 96, సత్తుపల్లి కి 113, మధిర కు 106, వైరా కి 99 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసినట్లు తెలిపారు. 5 మునిసిపాలిటీల్లోని 242 పోలింగ్ కేంద్రాల్లో 25 సెన్సిటివ్, 33 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి, భద్రతా చర్యలు పటిష్టం చెందినట్లు కలెక్టర్ అన్నారు. పటిష్ట భద్రత చర్యలు చేపడుతున్నట్లు, 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి వెంటనే అమలులోకి వస్తుందని కలెక్టర్ అన్నారు. ఎన్నికలు స్వేచ్ఛ గా, న్యాయబద్ధంగా, ప్రశాంతంగా నిర్వహణకు అన్ని వర్గాల వారు సహకరించాలని కలెక్టర్ అన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- **వెల్టూర్ లో సీసీ కెమెరాల ప్రారంభం భద్రత మరింత పటిష్టం**
- **వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి**



**పెద్దమందడి,జనవరి27(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో గ్రామస్తుల సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన 10 అధునాతన సీసీ కెమెరాలను జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా ఈ కెమెరాలను ప్రధాన చౌరస్తాల్లో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, అవి 24 గంటలు నిరంతరం పనిచేస్తూ నేరాల నివారణకు, నిందితుల గుర్తింపుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు.నేరాల నియంత్రణలో పోలీసులతో పాటు ప్రజలు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ఈ కాలంలో గ్రామాలు, నివాస ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు.సీసీ కెమెరాల ఫుటేజీని వనపర్తి కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షిస్తామని తెలిపారు.సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ముందుకొచ్చిన గ్రామస్తులు, దాతలను జిల్లా ఎస్పీ అభినందించారు .అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, భద్రత విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొత్తకోట సీఐ రాంబాబు, పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి, వెల్టూర్ సర్పంచ్ అశోక్, మాజీ సర్పంచ్ బాలచంద్రయ్య, మాజీ వైస్ ఎంపీపీ సాఖ వెంకటయ్య, గ్రామ కంటెస్టెంట్ సర్పంచ్ అభ్యర్థి వడ్డే శేఖర్, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, నాగమణి నరేష్, గ్రామ అధ్యక్షులు ప్రేమ సాగర్ , రవీందర్, వివేక్, బిజెపి మాజీ అధ్యక్షుడు రమేష్, రిటైర్డ్ సీఐ బాల్ రెడ్డి, గ్రామ నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అబద్ధపు హామీలతో 78 ఏండ్ల దోపిడి

**బొడ్డుపల్లి చంద్రశేఖర్ టిఆర్పి రాష్ట్ర యూత్ అధ్యక్షులు**



**కొత్తకోట,జనవరి27(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ యువజన భవిష్యత్ కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు జిల్లా యూత్ అధ్యక్షులు జి. రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రాష్ట టిఆర్పి యూత్ అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు జైపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బొడ్డుపల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో 78 ఏండ్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర జనాభాలో 95 శాతం ఉన్న బహుజనులు పన్నులు చెల్లిస్తుంటే, అగ్రవర్ణ పార్టీలు దొడ్డి దారిన సంపద దోచుకుంటూ బీసీలకు రాజ్యాంగ ఫలాలు అందకుండా బానిసలుగా మార్చుతున్నాయని విమర్శించారు.తెలంగాణలో బీసీ నినాదంతో టిఆర్పి పార్టీ ముందుకు రావడంతో అగ్రవర్ణ పార్టీల పునాదులు కదులుతున్నాయని అన్నారు.వనపర్తి గడ్డ బీసీల అడ్డా అని, రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో వాడవాడలో టిఆర్పి జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తలు నియమ నిబద్ధతతో, అంకితభావంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలన్నీ పెత్తందార్ల ఆధీనంలోనే ఉన్నాయని, రెడ్డి ఆధిపత్య పార్టీల్లో బహుజన బిడ్డలు ఎంత కష్టపడినా యజమానులు కాలేరని వ్యాఖ్యానించారు. ఎన్ని కుట్రలు చేసినా మున్సిపాలిటీల్లో కత్తెర గుర్తు పోటీలో ఉంటుందని, బీసీ పార్టీ సత్తా చాటుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి ముదిరాజ్ దయానంద్, జిల్లా పార్టీ అధ్యక్షులు విజయ్ యాదవ్, కొత్తకోట మండలం యూత్ అధ్యక్షులు ఎండి రఫిక్, మండలాల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## నాచారంలో దోమల నివారణకు స్పెషల్ ఫాగింగ్ డ్రైవ్

**నాచారం, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ పరిధిలో దోమల సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేక ఫాగింగ్ డ్రైవ్‌ను కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మూడు పెద్ద ఫాగింగ్ మిషిన్లు, నాలుగు చిన్న మిషిన్ల సహాయంతో డివిజన్‌లోని ప్రతి వీధి, ప్రతి ఇంటి వరకు మూలమూలకు ఫాగింగ్ చేపట్టారు. దోమల కారణంగా వ్యాపిస్తున్న వైరల్ జ్వరాలు, డెంగీ వంటి వ్యాధులను నియంత్రించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కార్పొరేటర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, విటల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, మార్కెట్ లక్ష్మణ్, రహీం భాయ్ బిలాల్‌తో పాటు ఎంటమాలజీ సూపర్వైజర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు కూడా ఫాగింగ్ కార్యక్రమానికి సహకరించాలని నాయకులు కోరారు.



## యువ గర్జన సదస్సులో ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు

**మోదీ నాయకత్వంలోనే దేశానికి గౌరవం**

**మేడ్చల్ మల్కాజ్గిరి, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** నిజాంపేటలో నిర్వహించిన బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలోని “యువ గర్జన” సదస్సులో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంపై ప్రశంసల వర్షం కురిపించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “ఆల్ గ్లిట్టర్స్ ఆర్ నాట్ గోల్డ్ అన్నట్లే నాయకులందరూ ఒకేలా ఉండరని, కొందరు దొంగలు ఉంటే కొందరు నిజమైన ప్రజానాయకులు ఉంటారని” వ్యాఖ్యానించారు. దేశం గర్వపడే బిడ్డ ప్రధాని నరేంద్ర మోడీ అని స్పష్టం చేశారు.గత ప్రధానుల పాలనలో టూజీ స్కాం, కోల్ స్కాం, బోఫోర్స్ స్కాం వంటి అనేక అవినీతి ఘటనలు చోటు చేసుకున్నాయని, అప్పట్లో భారత్ స్కాముల మయంగా మారి థర్డ్ వరల్డ్ కంట్రీగా గుర్తింపు పొందిందని విమర్శించారు. అయితే నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా వేగంగా ప్రయాణిస్తూ,ప్రపంచంలో ఎదుగుతున్న శక్తిగా మారిందన్నారు.ప్రపంచంలో ఎక్కడ ఉన్నా “నేను ఇండియన్” అని గర్వంగా చెప్పుకునే పరిస్థితిని మోడీ తీసుకువచ్చారని, ప్రపంచ పటంపై భారత పతాకం గర్వంగా రెపరెపలాడుతోందన్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో భారత విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడం ద్వారా మోడీ నాయకత్వ సత్తా ప్రపంచానికి అర్థమైందన్నారు.కరోనా మహమ్మారి సమయంలో అభివృద్ధి చెందిన దేశాల కంటే ముందే భారత్ వ్యాక్సిన్ తయారు చేసి ప్రపంచానికి అందించిందని తెలిపారు. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా ఇప్పుడు నినాదాలు మాత్రమే కాకుండా వాస్తవంగా మారాయని పేర్కొన్నారు. యువశక్తిని నమ్మే మోడీ ప్రపంచానికి సవాలు విసురుతున్నారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు.“ఈసారి ఈ గడ్డమీద కాషాయ జెండా ఎగురుతుంది” అని ధీమా వ్యక్తం చేశారు. గాడిదలకు గడ్డి వేసి ఆవులకు పాలు రావని ఉదహరిస్తూ, మంచి నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ యువతకు అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని గుర్తు చేసుకుంటే సిగ్గు వేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం పడే కష్టాలను గుర్తుంచుకొని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని యువతకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సాయి కృష్ణా రెడ్డి, వినీత్, అశోక్, యూత్ అధ్యక్షుడు గణేష్, మహేందర్, సీనియర్ నాయకులు మల్లారెడ్డి కాంతారావు, గిరివర్ధన్ రెడ్డి, కార్పొరేటర్ శేషగిరి రావు, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, శిల్ప, అధ్యక్షులు రాజు, బిక్షపతి, నరేందర్‌లకు ఈటల రాజేందర్ కృతజ్ఞతలు తెలిపారు.



## పెద్దమందడిలో ప్రెస్ క్లబ్ భవనానికి స్థల పరిశీలన

**పెద్దమందడి,జనవరి27(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం కోసం మంగళవారం స్థల పరిశీలన చేపట్టినట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎం. ఈశ్వర్ తెలిపారు. జర్నలిస్టులకు శాశ్వత వేదిక కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రక్రియ ప్రారంభమైందన్నారు.ప్రెస్ క్లబ్ భవనానికి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయాలని గతంలో జర్నలిస్టుల బృందం ఎమ్మెల్యే మేఘా రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే ప్రభుత్వ స్థలంలో సర్వే చేసి జర్నలిస్టులకు అనువైన స్థలాన్ని కేటాయించాలని తహసిల్దార్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు.ఈ మేరకు తహసిల్దార్ పాండు నాయక్ సూచనలతో డిప్యూటీ తహసిల్దార్ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ గణేష్, సర్వేయర్ మన్యం మంగళవారం రైతు వేదిక పరిసరాల్లోని సర్వే నంబర్ 824లో కొంత స్థలాన్ని గుర్తించారు. గుర్తించిన స్థలానికి సంబంధించిన లొకేషన్ మ్యాప్‌ను సిద్ధం చేసి తహసిల్దార్‌కు నివేదించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎం .ఈశ్వర్‌తో పాటు జర్నలిస్టులు గోపాల్ చారి, శ్రీనివాస యాదవ్, చంద్రశేఖర రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, శివకుమారాచారి, బుద్వేష్, సురేందర్ గౌడ్, అశోక్, నాగరాజు, రామ్ నరేష్, మన్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## న్యాయవాదుల కోసం సెవెన్ రా ఫౌండేషన్ ఉచిత మెగా హెల్త్ క్యాంప్

**మల్కాజిగిరి, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజిగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల కోసం సెవెన్ రా ఫౌండేషన్ నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్ అభినందనీయమని అసోసియేషన్ నాయకులు ప్రశంసించారు. మంగళవారం కుషాయిగూడ కోర్టు ప్రాంగణంలో సెవెన్ రా ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది తిప్పారపు కీర్తి కుమార్ ఆధ్వర్యంలో ఈ ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఈ హెల్త్ క్యాంప్‌లో న్యాయవాదులకు షుగర్, బీపీ, హెచ్‌బీఏ1సీ, దంత పరీక్షలు, కంటి పరీక్షలు వంటి వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. వందలాది మంది న్యాయవాదులు ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు.
న్యాయవాదుల ఆరోగ్య పరిరక్షణకు సెవెన్ రా ఫౌండేషన్ చేపట్టిన ఈ కార్యక్రమం ప్రశంసనీయమని బార్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బాపిరెడ్డి, అమరేందర్ రెడ్డి, రాజభక్షి శ్రీనివాస్, అరుణ్ చంద్ర, కే. శ్రావణ్, శివ తదితరులు పాల్గొన్నారు.



## హెల్మెట్‌తోనే రోడ్డు భద్రత... జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ

**అయ్యాపు రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచిత హెల్మెట్ పంపిణీ**

**పెద్దమందడి,జనవరి27(తెలంగాణ ముచ్చట్లు):** రోడ్డు భద్రతపై బలమైన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో అయ్యాపు రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఉచితంగా హెల్మెట్లు పంపిణీ చేసే కార్యక్రమం పెద్దమందడి మండల కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం తగ్గించాలంటే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. ప్రత్యేకంగా జర్నలిస్టులకు హెల్మెట్లు పంపిణీ చేయడాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు. జర్నలిస్టుల ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన సందేశం విస్తృతంగా ప్రజల్లోకి చేరుతుందని పేర్కొంటూ, ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన అయ్యాపు రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ సేవలను ఆమె ప్రశంసించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు హెల్మెట్లను పంపిణీ చేయడం ద్వారా రోడ్డు భద్రతపై బలమైన సందేశం ప్రజల్లోకి వెళ్తుందని భావించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.జర్నలిస్టుల కలం ద్వారా ఈ అవగాహన మరింత విస్తృతంగా ప్రజల్లోకి చేరుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా ఎస్పీ సునీత రెడ్డి చేతుల మీదుగా జర్నలిస్టులకు ఉచిత హెల్మెట్లను పంపిణీ చేశారు.జర్నలిస్టులు మాట్లాడుతూ.. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేలా తమను గౌరవించి హెల్మెట్లు అందించిన అయ్యాపు రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ నిర్వాహకులకు, అలాగే జంగం శివకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తోపాటు పోలీస్ అధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులు, జర్నలిస్టులు, మహిళా సమాఖ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అవకాశమిచ్చి ఆశీర్వదించండి

- 4వ డివిజన్ నుంచి మీ బిడ్డగా ముందుకొస్తున్నా
- కాశిపాక మురళీకృష్ణ



**కరీంనగర్,జనవరి27(తెలంగాణ ముచ్చట్లు) :** కరీంనగర్ నగరంలోని నాలుగో డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా, ప్రజల మధ్యే పెరిగిన మీ బిడ్డగా కార్పొరేటర్ పదవికి పోటీ చేస్తున్న కాశిపాక మురళీకృష్ణ, ప్రజలు తనకు అవకాశం ఇచ్చి గెలిపిస్తే డివిజన్‌ను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి కరీంనగర్‌లోనే ఆదర్శంగా నిలుపుతానని ధీమా వ్యక్తం చేశారు. డివిజన్ ప్రజలు తనపై నమ్మకం ఉంచి ఆశీర్వదించాలని కోరుతూ ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.
సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన తన ప్రయాణం ప్రజల సమస్యలతో ముడిపడి ఉందని పేర్కొన్న కాశిపాక మురళీకృష్ణ, యువత, మహిళలు, పేదలు, మధ్యతరగతి ప్రజల అవసరాలు తనకు బాగా తెలుసన్నారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ, వారి సమస్యలను నేరుగా విని పరిష్కరించడమే తన రాజకీయ లక్ష్యమని స్పష్టం చేశారు. మాటల్లో కాదు, పనుల్లోనే అభివృద్ధిని చూపించాలన్న సంకల్పంతో ఈ ఎన్నికల్లో ప్రజల ముందుకు వస్తున్నానని తెలిపారు.
తాను 2014 నుంచి 2016 వరకు ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూ విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేశానని గుర్తు చేశారు. అనంతరం 2016 నుంచి 2018 వరకు యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా యువతకు ఉపాధి, హక్కుల అంశాలపై చురుకుగా పని చేశానన్నారు. అలాగే 2018 నుంచి 2022 వరకు దుర్షేడ్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా, 2018 నుంచి 2023 వరకు వార్డు సభ్యుడిగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అనేక సమస్యలను పరిష్కరించిన అనుభవం తనకు ఉందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతూ పార్టీ బలోపేతంతో పాటు ప్రజా ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించానని చెప్పారు.
నాలుగో డివిజన్‌లో డ్రైనేజీ, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, పార్కులు, విద్యా-ఆరోగ్య వసతులు వంటి మౌలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని కాశిపాక మురళీకృష్ణ హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు, మహిళలకు భద్రత, వృద్ధులకు సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తా.

## జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం





**ఘట్కేసర్, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలను పురస్కరించుకొని జిహెచ్ఎంసి ఘట్కేసర్ సర్కిల్ కార్యాలయంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ ఏ. వాణి తో పాటు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందికి, ప్రజలకు రోడ్డు ప్రమాదాలను నివారించే మార్గాలు, ట్రాఫిక్ నియమాల పాటింపు, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం యొక్క ప్రాముఖ్యతపై వివరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారి తీస్తుందని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెరుగుతుందని వారు తెలిపారు.

## బీజేపీ సీనియర్ నాయకుడు రాజేశ్వర్ రావుకు ఘన నివాళి



**ఎల్కతుర్తి, జనవరి 27: (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ గ్రామ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్, మాజీ గ్రామ సర్పంచ్ సోలంకి రాజేశ్వర్ రావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల కన్నుమూశారు. ఆయన మృతితో గ్రామంలోనే కాకుండా బీజేపీ శ్రేణుల్లో తీవ్ర విషాదం నెలకొంది.
ఈ సందర్భంగా ఎల్కతుర్తి బీజేపీ మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ నేతృత్వంలో బీజేపీ రాష్ట్ర బీసీ మోర్చా కార్యదర్శి ఎర్రగొల్ల శ్రీనివాస్, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజేశ్వర్ రావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
నాయకులు మాట్లాడుతూ, గ్రామాభివృద్ధి మరియు ప్రజాసేవ రంగాల్లో సోలంకి రాజేశ్వర్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పార్టీ పట్ల ఆయన చూపిన అంకితభావం, సేవా దృక్పథం యువ నాయకులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన అకాల మరణం పార్టీకి, గ్రామానికి తీరని లోటని అన్నారు.
ఈ దుఃఖ సమయంలో పార్టీ తరపున రాజేశ్వర్ రావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

# అరణ్య సంరక్షణతోనే గ్రామీణ ఆర్థికాభివృద్ధి...



- ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి
- తెలంగాణ వన్ జీవన్‌ధారా – ఖమ్మం" పైలట్ ప్రాజెక్టు ప్రారంభించిన పార్లమెంట్ సభ్యులు

**ఖమ్మం బ్యూరో, జనవరి - 27(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రైజింగ్ - విజన్ 2047కు అనుగుణంగా, అరణ్యాలపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడం, అక్రమ ఆక్రమణలను నియంత్రించడం, అలాగే మానవ-వన్యప్రాణి సంఘర్షణలను నివారించడమే ప్రధాన లక్ష్యంగా ఖమ్మం జిల్లా అటవీ శాఖ ముందడుగు వేసిందని,

అరణ్య సంరక్షణను గ్రామీణ ఆర్థికాభివృద్ధితో అనుసంధానిస్తూ, అరణ్యాలపై ఆధారపడే సముదాయాలకు స్థిరమైన గ్రీన్ జీవనోపాధులు కల్పించే దిశగా జిల్లా అరణ్య అధికారి, ఖమ్మం ప్రతిపాదించిన వినూత్న కార్యక్రమమే "తెలంగాణ వన్ జీవన్‌ధారా - ఖమ్మం" అని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు.

మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖమ్మం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన "తెలంగాణ వన్ జీవన్‌ధారా - ఖమ్మం ( టీవిజే-ఖమ్మం)" పైలట్ ప్రాజెక్టును పార్లమెంట్ సభ్యులు, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ

"అడవులను రక్షించుకుంటూనే సముదాయ ఆధారిత గ్రీన్ జీవనోపాధులను అభివృద్ధి చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు స్థానిక ప్రజలకు స్థిరమైన ఉపాధి లభిస్తుందని అన్నారు. "తెలంగాణ రైజింగ్ - విజన్ 2047" లక్ష్యాలకు అనుగుణంగా వన సంరక్షణ సమితులను (VSS) స్వయం ఆధారిత గ్రీన్ ఎంటర్‌ప్రైజ్‌లుగా తీర్చిదిద్దే ఈ వినూత్న ప్రయత్నాన్ని ఎంపీ ప్రశంసించారు.

కార్యక్రమంలో *జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ

ఖమ్మం జిల్లాలో అరణ్య సంరక్షణ ఫలితాలు మరియు సముదాయ ఆదాయం రెండింటినీ ఒకే పాలనా వ్యవస్థలో అనుసంధానిస్తూ స్థిరమైన జీవనోపాధులను అమలు చేయడమే ఇట్టి ప్రాజెక్టు లక్ష్యమని తెలిపారు.

అరణ్యాలను నాశనం చేయకుండా, అరణ్యాల నుంచే ఆదాయం అనే సిద్ధాంతమే ఈ కార్యక్రమానికి పునాది అని జిల్లా అటవీ అధికారి తెలిపారు. వన సంరక్షణ సమితులను స్వయం ఆధారిత గ్రీన్ ఎంటర్‌ప్రైజ్‌లుగా తీర్చిదిద్ది, పర్యావరణ భద్రతతో పాటు గ్రామీణ సమగ్రాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు అన్నారు. నైపుణ్యాభివృద్ధి, యూనిట్ల స్థాపన, మార్కెట్ అనుసంధానం, ప్రభుత్వ, కార్పోరేట్ సంస్థల భాగస్వామ్యాల ద్వారా వన సంరక్షణ సమితులను పనితీరు ఆధారిత సముదాయ సంస్థలుగా అభివృద్ధి చేస్తామన్నారు. నెలవారీ కెపిఐలు, పారదర్శక లెక్కలు, ఆడిట్ క్రమశిక్షణతో ప్రాజెక్టు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఉన్న యూనిట్ల బలోపేతం

వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు, ఆటోలు, టెంట్ యూనిట్లు, లీఫ్ ప్లేట్ యూనిట్లు వంటి ఆస్తులను వ్యాపార ప్రణాళికలు, మార్కెట్ లింకేజీల ద్వారా స్థిర ఆదాయ వనరులుగా అభివృద్ధి చేయనున్నట్లు అటవీ అధికారి అన్నారు.

కేంద్ర పథకాలు జిఐఎం, కాంపా, నేషనల్ బాంబు మిషన్, పీఎంఇజిపి/ఎంఎస్ఎంఇ, పీఎం కెఇవై, పీఎం సూర్య ఘర్ తదితర పథకాలు సద్వినియోగం చేసుకొనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక శాఖ, సెర్ప్, గ్రామీణాభివృద్ధి, ఎంఎస్ఎంఇ ల సహకారం తీసుకోనున్నట్లు అటవీ అధికారి అన్నారు. భాగస్వామ్యాలు: జెఐసిఏ, సిఎస్ఆర్ సంస్థలు, ఎన్జీవోస్ ల భాగస్వామ్యం తీసుకుంటామన్నారు. "తెలంగాణ వన్ జీవన్‌ధారా - ఖమ్మం" ద్వారా వన సంరక్షణ సమితులను స్వయం ఆధారిత గ్రీన్ ఎంటర్‌ప్రైజ్‌లుగా తీర్చిదిద్ది, అరణ్య సంరక్షణతో పాటు గ్రామీణ ఆర్థికాభివృద్ధి సాధించడం ఈ విధానం ప్రధాన లక్ష్యమని, ఈ కార్యక్రమం 2047 నాటికి జిల్లా అంతటా విస్తరించి, ఖమ్మం జిల్లాను పర్యావరణ-ఆర్థిక వృద్ధిలో అగ్రగామిగా నిలబెడుతుందని జిల్లా అటవీ అధికారి తెలిపారు.




ఈ కార్యక్రమంలో డిఆర్డీవో సన్యాసయ్య, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఎఫ్డివో మంజుల, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పామాయిల్ తోటల్లో పసుపు సాగు విజయవంతం.!

**మంత్రి తుమ్మల ప్రయోగానికి మంచి ఫలితం**

**అశ్వారావుపేట, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మపేట మండలం, లింగాలపల్లి గ్రామంలో పామాయిల్ తోటల్లో అంతర పంటగా పసుపు సాగు విజయవంతమైంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన స్వంత వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన ప్రయోగాత్మక సాగు మంచి ఫలితాలను ఇస్తోంది.

సాధారణంగా ఈ ప్రాంతంలో పామాయిల్ సాగు ప్రారంభ దశలో వేరుశెనగ, మొక్కజొన్న వంటి పంటలను రైతులు అంతర పంటలుగా సాగు చేస్తున్నారు. అయితే పసుపుకు ఉన్న మార్కెట్ గిరాకీని దృష్టిలో పెట్టుకుని, ఈ ప్రాంత వాతావరణ పరిస్థితులు పసుపు సాగుకు అనుకూలమా అనే అంశాన్ని తెలుసుకునేందుకు మంత్రి ఈ ప్రయోగం చేపట్టారు.

తాజాగా పసుపు దుంపలను పరిశీలించిన మంత్రి, దుంపలు బాగా ఊరడంతో పాటు నాణ్యంగా ఉన్నాయని తెలిపారు. పామాయిల్ తోటల్లో అంతర పంటగా పసుపు సాగు చేస్తే రైతులకు అదనంగా లక్షల్లో ఆదాయం వచ్చే అవకాశముందని ఈ ప్రయోగం ద్వారా స్పష్టమైంది.

రైతులకు భరోసా కల్పించేలా మంత్రి స్వయంగా సాగు చేసి చూపడం పట్ల స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రజాస్వామ్యంలో పెరిగిపోతున్న మౌనం..

**ప్రశ్నించే స్వరం తగ్గిపోవడం సమాజానికి ముప్పే**

ప్రజాస్వామ్యం అనేది కేవలం ఎన్నికల ప్రక్రియ మాత్రమే కాదు. అది నిరంతర ప్రశ్నలతో, చర్చలతో, విభేదాలతో జీవించే వ్యవస్థ. కానీ నేటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యంలో మౌనం నెమ్మదిగా పెరుగుతోంది. తప్పు జరుగుతున్నా ప్రశ్నించకపోవడం, అన్యాయం కనిపించినా మౌనంగా తల వంచడం, అధికార నిర్ణయాలపై సందేహాలు ఉన్నా మాట్లాడటానికి వెనుకాడటం వంటి పరిస్థితులు సమాజంలో విస్తరిస్తున్నాయి. ఇది ప్రమాదకర సంకేతం. ఎందుకంటే ప్రజలు మాట్లాడటం మానేస్తే, అధికారానికి ఎలాంటి నియంత్రణ ఉండదు. ప్రశ్నించే స్వరం తగ్గిన చోటే అణచివేతకు, ఏకపక్ష నిర్ణయాలకు, ప్రజా హక్కుల హరణకు దారి తెరుస్తుంది. ఒకప్పుడు ప్రజాస్వామ్యంలో భాగంగా భావించిన చర్చా సంస్కృతి ఇప్పుడు క్రమంగా క్షీణిస్తోంది. కుటుంబ స్థాయి నుంచి సమాజ స్థాయి వరకు భిన్న అభిప్రాయాలను వినే సహనం తగ్గుతోంది. విభేదాన్ని శత్రుత్వంగా భావించే ధోరణి పెరుగుతోంది. దీనివల్ల ప్రజలు తమ అభిప్రాయాలను బహిరంగంగా చెప్పడానికి భయపడుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో మాట చెప్పినా విమర్శలు, దూషణలు, బెదిరింపులు ఎదురవుతాయన్న భావన ప్రజల్లో బలపడుతోంది. ఫలితంగా నిజమైన సమస్యలు మౌనంగా మూలల్లోకి నెట్టబడుతున్నాయి. ప్రజల గుండెల్లో ఉన్న అసంతృప్తి బయటపడకుండా లోపలే మరిగిపోతూ, ఒక రోజు తీవ్రమైన రూపంలో పేలే ప్రమాదం ఉంది. ప్రశ్నించే స్వరం తగ్గిపోవడం పాలకులకు తాత్కాలిక సౌలభ్యంగా అనిపించవచ్చు. కానీ దీర్ఘకాలంలో అదే పాలనకు పెద్ద ముప్పుగా మారుతుంది. ప్రజలు ప్రశ్నించనప్పుడు తప్పిదాలు సరిదిద్దుకునే అవకాశం పాలకులకు ఉండదు. లోపాలు పెరుగుతాయి, విధానాలు ప్రజల అవసరాలకు దూరమవుతాయి. ప్రజల అభిప్రాయాలకు విలువ లేకపోతే పాలన ప్రజల నుంచి విడిపోయిన యంత్రంలా మారుతుంది. అప్పుడు ప్రజాస్వామ్యం పేరుకే మిగిలి, ఆచరణలో అది అధికార కేంద్రీకరణగా మారే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితికి సమాజం కూడా కొంతవరకు బాధ్యత వహించాల్సిందే. అన్యాయం జరిగినప్పుడు అది మనకు నేరుగా తాకకపోతే పట్టించుకోకపోవడం, "మనకెందుకు" అనే నిర్లక్ష్య భావన, ప్రశ్నిస్తే సమస్యలు వస్తాయన్న భయం... ఇవన్నీ కలిసి మౌనాన్ని పెంచుతున్నాయి. కానీ ఈ మౌనం చివరికి అందరినీ తాకుతుంది. ఈరోజు పక్క వాడి సమస్యగా కనిపించినది, రేపు మన ఇంటి ముందే నిలబడే అవకాశం ఉంది. అందుకే ప్రజాస్వామ్యంలో నిర్లక్ష్యానికి చోటు ఉండకూడదు. ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచాలంటే ప్రతి పౌరుడూ తన వంతు బాధ్యత నిర్వర్తించాలి. ప్రశ్నించడం, అభిప్రాయం వ్యక్తం చేయడం, చర్చలో పాల్గొనడం హక్కులే కాదు, కర్తవ్యాలు కూడా. భిన్న అభిప్రాయాలను వినే సహనం పెంచుకోవాలి. అధికారాన్ని గౌరవించాలి గానీ, అంధంగా అనుసరించకూడదు. ప్రజల స్వరం వినిపించే వేదికలు బలపడాలి. విద్యా వ్యవస్థ నుంచి మీడియా వరకు ప్రశ్నించే ఆలోచనను ప్రోత్సహించాలి. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం తిరుగుబాటు కాదు. అది వ్యవస్థను బలోపేతం చేసే శక్తి. మౌనం శాంతికి సంకేతం కాదు, అది ప్రమాదానికి ముందస్తు సూచన. ప్రజలు మాట్లాడటం మానేసిన రోజే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. అందుకే ప్రశ్నించే స్వరం తగ్గిపోకుండా, మరింత బలపడేలా సమాజం మొత్తం ఆలోచించాల్సిన అవసరం ఉంది.

# తొలి, మలి తెలంగాణ ఉద్యమాలకు మేధోస్వరూపం – ప్రొఫెసర్ కేశవరావు జాదవ్

తెలంగాణ ఉద్యమ చరిత్రలో కొందరు నేతలు పోరాటాల ద్వారా గుర్తింపును సంపాదిస్తే, మరికొందరు తమ ఆలోచనల ద్వారా ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తారు. ఆ కోవకు చెందిన అరుదైన వ్యక్తిత్వం తొలి, మలి తెలంగాణ ఉద్యమ నేత, సామాజిక సంస్కర్త ప్రొఫెసర్ కేశవరావు జాదవ్. తెలంగాణ ప్రజల ఆవేదనను మేధోపోరాటంగా మార్చి, ఉద్యమానికి తాత్విక బలాన్ని అందించిన నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. తొలి తెలంగాణ ఉద్యమ కాలంలోనే ప్రాంతీయ వివక్ష, ఆర్థిక అసమానతలు, పరిపాలనా అన్యాయాలపై ఆయన స్పష్టమైన విశ్లేషణతో ప్రజల్లో చైతన్యం నింపారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న దోపిడీని గణాంకాలతో, చారిత్రక ఆధారాలతో ప్రజల ముందుంచారు. ఉద్యమం భావోద్వేగ నినాదాలకే పరిమితం కాకూడదని, బలమైన ఆలోచనా పునాదుల మీద నిలబడాలని ఆయన నమ్మకం. అందుకే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ వర్గాలు ఉద్యమంలో భాగస్వాములయ్యేలా మేధోచర్చలకు ప్రాధాన్యం ఇచ్చారు. ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ ఉద్యమ నేత మాత్రమే కాదు, సమాజాన్ని మార్చాలనే తపనతో పనిచేసిన సామాజిక సంస్కర్త కూడా. కుల, వర్గ వివక్షలపై ప్రశ్నలు వేయకుండా సమానత్వం సాధ్యం కాదని ఆయన స్పష్టంగా చెప్పారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి విద్యే ప్రధాన ఆయుధమని విశ్వసించిన ఆయన, ప్రజలను అవగాహనతో కూడిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేశారు. ప్రజలు ప్రశ్నించే స్థాయికి ఎదిగినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందని ఆయన అభిప్రాయం. కాలం మారినా తెలంగాణ సమస్యలు పూర్తిగా పరిష్కారం కాలేదని గ్రహించిన కేశవరావు జాదవ్ మలి తెలంగాణ ఉద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారు. యువతకు తొలి ఉద్యమ అనుభవాలను వివరించి, ఉద్యమ లక్ష్యాలపై స్పష్టత కల్పించారు. భావోద్వేగాలతో పాటు తర్కం, చరిత్ర అవగాహన, సామాజిక దృక్పథం అవసరమని ఆయన చేసిన బోధనలు ఉద్యమానికి మేధోబలం అందించాయి. ఉద్యమం ఒక తరానికి పరిమితం కాకుండా తరతరాలకు స్ఫూర్తిగా నిలవాలన్నదే ఆయన ఆకాంక్ష.

అధికార పదవులు, రాజకీయ లాభాల కోసం కాకుండా ప్రజల కోసం జీవించిన వ్యక్తి ప్రొఫెసర్ కేశవరావు జాదవ్. ఉద్యమంలో ఉన్నా, బయట ఉన్నా ప్రజల పక్షానే నిలబడ్డారు. ఆలోచనలకు ఉన్న శక్తిని ఆయన తన జీవితంతోనే నిరూపించారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న నేటి పరిస్థితుల్లో, ఆయన కలగన్న సమానత్వ సమాజ లక్ష్యం ఇంకా పూర్తిగా సాధించాల్సిన దశలోనే ఉందన్న సత్యాన్ని ఆయన ఆలోచనలు గుర్తు చేస్తున్నాయి. ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ జయంతి సందర్భంగా తెలంగాణ సమాజం ఆయన ఆశయాలను మరోసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రాంతీయ న్యాయం, సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువలు - ఇవే ఆయన మనకు ఇచ్చిన మేధో వారసత్వం. ఆ వారసత్వాన్ని కాపాడుకుంటూ, ప్రశ్నించే తత్వాన్ని కొనసాగిస్తూ, ప్రజల పక్షాన నిలబడటమే ఆయనకు నిజమైన నివాళి.

# పేద కుటుంబానికి అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి



- అన్వర్ పాషాకు రూ.2.20 లక్షల చెక్కు అందజేత
- మంత్రి పొంగులేటి చొరవతో ఆర్థిక వెసులుబాటు

**ఖమ్మం బ్యూరో, జనవరి 27(తెలంగాణ ముచ్చట్లు):** అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) భరోసానిచ్చింది. ఏదులాపురం మున్సిపాలిటీ రెండో వార్డుకు చెందిన షేక్ అన్వర్ పాషా కుమారుడు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం భారీగా ధనం వెచ్చించారు. ఈ విషయాన్ని స్థానిక యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏనుగు మహేష్.. రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సీఎంఆర్ఎఫ్ దరఖాస్తు చేయించారు. మంత్రి సిఫారసుతో ప్రభుత్వం నుంచి రూ.2,20,000 మంజూరయ్యాయి. మంగళవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారుడు అన్వర్ పాషా ఈ చెక్కును అందుకున్నారు. కష్టకాలంలో తమ కుటుంబాన్ని ఆదుకున్న మంత్రికి, సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# వల్భాపూర్ గ్రామ యువతకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలి



**రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్‌కు గ్రామ పంచాయతీ వినతి**

**ఎల్కతుర్తి, జనవరి 27: (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్భాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నిరుద్యోగ యువతి, యువకులకు రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సంబంధిత సంస్థ అధికారికి వినతి పత్రం అందజేశారు.

సూరారం గ్రామ పరిధిలో నిర్మాణం పూర్తి చేసుకున్న రిలయన్స్ బయో ఎనర్జీ లిమిటెడ్ సంస్థలో వల్భాపూర్ గ్రామానికి చెందిన అర్హత కలిగిన నిరుద్యోగ యువతి, యువకులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామ పంచాయతీ ప్రతినిధులు కోరారు. గ్రామ యువతకు ఉపాధి కల్పిస్తే వారి ఆర్థిక స్థితి మెరుగుపడటంతో పాటు గ్రామాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత శ్రీనివాస్ మాట్లాడుతూ, స్థానికంగా ఏర్పాటు అవుతున్న పరిశ్రమలు గ్రామ యువతకే తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. గ్రామ పరిధిలోని నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా సంస్థ యాజమాన్యం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొనగంటి శ్వేత శ్రీనివాస్, ఉపసర్పంచ్ అంబాల అనిల్ కుమార్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కీసరలో డిప్యూటీ కమిషనర్‌కు సీఐటీయూ-ఐఎఫ్‌టీయూ సమ్మె నోటీసు




**కీసర, జనవరి 27 (తెలంగాణ ముచ్చట్లు):** 2026 ఫిబ్రవరి 12న జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మె సందర్భంగా సీఐటీయూ-ఐఎఫ్‌టీయూ జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కీసర సర్కిల్-01 డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత్‌కు సమ్మె నోటీసు అందజేశారు.ఈ విషయాన్ని సీఐటీయూ కీసర మండల కార్యదర్శి, దమ్మాయిగూడ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బంగారు నర్సింగరావు, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు పి. శివబాబు తెలిపారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా అమలు చేయాలని జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను పరిరక్షించి, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.2026 ఫిబ్రవరి 12న జరగబోయే జాతీయ సార్వత్రిక సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కీసర మండల కమిటీ నాయకులు చింతకింది అశోక్ పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# ముప్పారం పంచాయతీ పాలనలో సరికొత్త ప్రయోగం విలేజ్ కేబినెట్

- విలేజీ కేబినేట్ తో గ్రామ స్థాయిలో పని విభజన
- వార్డుల వారిగా బాద్యతల అప్పగింత
- సామూహికంగా ఊరంతా ఊడ్చిన ముప్పారం
- పన్నుల వసూళ్లకు సరికొత్త పథకం
- పాలనలో వార్డు సభ్యులు, అభివృద్దిలో ప్రజల భాగస్వామ్యం





**ధర్మసాగర్,జనవరి27(తెలంగాణ ముచ్చట్లు):** కొత్తగా కొలువుదీరిన గ్రామ పంచాయతీల్లో కొత్త సర్పంచ్ లు తమ ముద్ర వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. పనుల విభజనతో అధికార వికేంద్రీకరణ, సమన్వయంతో వివిధ పనులో ప్రజలను భాగస్వామ్యం చేసే ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. ఇందులో భాగంగా ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామంలో బాద్యతలు చేపట్టిన బాద్యతలు చేపట్టిన 35 రోజుల్లోపే గ్రామ సర్పంచ్ వినూత్న కార్యక్రమాలపై దృష్టి సారిస్తూ అటు రాష్ట్రంలో ఇటు జిల్లాలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. పంచాయతీ పాలకవర్గం వచ్చిన వెంటనే పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇచ్చింది. ఊరంతా ఊడ్చి, డ్రైనేజీలు శుభ్రం చేసి, సంక్రాంతి సందర్భంగా గ్రామంలో కల్లాపి చల్లి వార్డుల వారిగా ముగ్గులేయించి పోటీలు నిర్వహించారు. ఊరంతా పారిశుద్యం నిర్వహించి కొత్త విద్యద్దీపాలను అమర్చారు. తాజాగా రిపబ్లిక్ డే సందర్భంగా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన 'విలేజ్ కేబినెట్' (గ్రామ కేబినెట్) రాష్ట్రంలోనే చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్ గుంటిపల్లి రేణుక గారి దూరదృష్టితో, పని విభజనతో వికేంద్రీకరణ అమలు చేసి, గ్రామ పాలనను మరింత సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా మార్చారు. ఇది కేవలం ఒక ప్రయోగం కాదు... ఇప్పటికే ఫలితాలు కనిపిస్తున్న సక్సెస్ స్టోరీగా జనం అభివర్ణిస్తున్నారు.

### విలేజ్ కేబినెట్:

**సరికొత్త పంథా**

12 మంది వార్డు సభ్యులకు గ్రామ అనసరాలకనుగుణంగా వివిధ శాఖలు (పోర్ట్‌ఫోలియోలు) కేటాయించారు. సర్పంచ్ రేణుక సాధారణ పాలన, పన్నులు, శాంతి భద్రతలు చూస్తుంటే... ఉప సర్పంచ్ తాళ్లపల్లి కుమరస్వామి విద్యుత్, వీధి లైట్లు, పారిశ్రామికాభివృద్ధి బాధ్యత తీసుకున్నారు. గడ్డం గణేశ్ గొర్రెల పెంపకం, పశుసంవర్ధకం, సహకార సంఘాలు, గిడ్డంగులు బాధ్యతలు. వెల్దండి శ్వేత విద్యాసాగర్ తాగునీరు, పారిశుద్ధ్యం, పెన్షన్లు (పంచాయతీ రాజ్), చేనేత సంక్షేమం పై దృష్టి సారిస్తారు. అలాగే వేములకొండ యాదగిరికి చెరువు పరిరక్షణ, నీటి పారకం, సాగు కాలువలు (నీటి పారుదల శాఖ), గోకల ప్రణీత సలీం కు వైద్యారోగ్యం, ఆశావర్కర్ల పర్యవేక్షణ, నరేండ్ల రాజేశ్ కు పాఠశాలల అభివృద్ధి, యువజన సంఘాలు, క్రీడలు (విద్యాశాఖ), గృహ నిర్మాణం, ముంజ క్రిష్ణవేణి అశోక్ కి మహిళా శిశు సంక్షేమం, అంగన్ వాడీలు, వివోలు, ఐకెపిల పర్యవేక్షణ, మారబోయిన జయ సదానందంకు చేపల పెంపకం, మత్స్యకారుల అభివృద్ధి (మత్స్యశాఖ), ఎతిరాజుల శోభారాణి మల్లయ్య కు వ్యవసాయం, పాడి పరిశ్రమ, దేవాదాలయాల అభివృద్ధి, చిట్యాల సునీత బాలస్వామి కి గ్రామీణ ఉపాధి (కరువుపనులు), సంక్షేమ శాఖ (ఎస్సీ, ఎస్టీ, బీసీ) కందుకూరి విజయచందర్ కు రోడ్లు, భవనాలు, కొత్త నిర్మాణాలు, నిత్యావసరాలు (పౌర సరఫరాలు)కర్నే రాధ గణేశ్ కు గారు(అదనపు?)కార్మిక, దినసరి కూలీలు, ఉపాధి కల్పన బాద్యతలు కేటాయించారు. ఈ మేరకు వివిద బాద్యతల హోదాలో వార్డు సభ్యులు సంబంధిత బాద్యతలు రిపబ్లికే డే సందర్భంగా స్వీకరిస్తూ సంతకాలు చేశారు.

**పన్నుల వసూళ్లలో కొత్త పథకం**

గ్రామంలో పేరకుపోయిన బకాయిల వసుళ్ల కోసం సర్పంచ్ గుంటిపల్లి రేణుక ఆధ్వర్యంలో పన్నుల వసూళ్లకు కొత్త పథకం అమలు చేశారు. పాత బకాయిల్లోని నల్లా, ఇంటి పన్నులపై 50 శాతం రాయితీ ఇవ్వడంతో పాటు గడువులోగా చెల్లిస్తే రూ.5వేలు డ్రా పద్దతిలో నగదు బహుమతిని ప్రకటించి అమలు చేస్తున్నారు. గ్రామస్తులతో సంభాషణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, స్వచ్ఛందంగా వసూళ్లు పెంచారు. ఇది గ్రామ నిధులను బలోపేతం చేసి, మరిన్ని అభివృద్ధి పనులకు దోహదపడుతోంది.

**ఊరంతా ఊడ్చి.. ఇల్లిల్లూ ముగ్గులలికి**

గాడి తప్పిన పంచాయతీ పాలనను పాత ఏడాదిలోనే వదిలేస్తూ సామూహికంగా ఊరంతా ఊడ్చి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. సర్పంచ్ రేణుక ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు,ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవో కలిసి డ్రైవ్ చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకున్ని ఊరంతా కల్లాపి చల్లి వార్డుల్లో ప్రతీ ఇల్లు సహజసిద్ద రంగుల్తో ముగ్గులేసారు. ముగ్గులేసిన ప్రతీ వార్డుల్లో బహుమతులు ప్రకటించారు. పండుగ సందర్భంగా కొత్త విద్యుద్దీపాలు అలంకరించారు.

## కొత్త ఆలోచనతో పాలన:

**సర్పంచ్ గుంటిపల్లి రేణుక**



అభివృద్దిలో మండల, జిల్లా స్థాయి అధికారులతో వార్డు సభ్యులు సమన్వయం చేసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తు "కొత్త సంవత్సరంలో కొత్త ఆలోచనలతో అభివృద్ధి" తో పంచాయతీ పాలకవర్గం పనిచేస్తోందని సర్పంచ్ రేణుక చెప్పారు. గ్రామ సమస్యలను గుర్తించి జిల్లా, మండల స్థాయి అధికారులతో ఏ సమస్య వచ్చినా అధికారులు స్పందించేలా ధర్మసాగర్ మండల అధికారులతో ప్రత్యేక వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని ముందుకు సాగుతున్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపి కడియం కావ్యల ప్రోత్సాహంతోనే తమ కొత్త పాలన సాగుతోందని, ముప్పారం గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పరిచేలా పలు స్వచ్ఛద సంఘాలు ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. అయితే తొలి ఆరు నెలలు పంచాయతీ పాలన, పారిశుద్య, వీధి లైట్ల నిర్వహణ అంశాలపై దృష్టి సారించే ఆ తర్వాత ప్రజల భాగస్వామ్యంతో ఊరి అభివృద్ధికి ప్రణాళికలు సిద్దం చేస్తామని, ఈ మేరకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి మార్గదర్శనంలో ముందుకు సాగుతామన్నారు.

**విధుల్లో గ్రామ అమాత్యులు**

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా విలేజీ కేబినేట్ ను ప్రవేశపెట్టిన ముప్పారం గ్రామ పంచాయతీలో బాద్యతలు చేట్టిన వివిధ శాఖల బాద్యులు మంగళవారం వారి విధుల్లో నిమగ్నమవుతున్నారు. పాఠశాల విద్య బాద్యుడిగా నరేండ్ల రాజేశ్ ఇద్దరు చిన్నారులను ప్రభుత్వ బడిలో చేర్పించారు. గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహించవద్దన్న పాలకవర్గ తీర్మాణం మేరకు రాజేశ్ చొరవ తీసుకుని బడి పిల్లలను సర్కారీ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. పంచాయతీ రాజ్ విభాగ బాద్యురాలిగా వేల్దండి శ్వేత విద్యాసాగర్ పంచాయతీల పారిశుద్యం, పెన్షన్ల వితరణ కార్యక్రమంలో ఉన్నారు. గ్రామ పంచాయతీ లో దగ్గరుండి తపాలాశాఖ సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లు చేపించి వృద్దులకు, వితంతువులకు పెన్షన్లు ఇప్పించారు. ముప్పారంలో గ్రామంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్ ను ఆ శాఖ బాద్యురాలు గోకల ప్రణీతా సలీం సందర్శించి అక్కడి సౌకర్యాలపై సమీక్షించారు. పేద రోగులకు రోజువారిగా మందులు, వైద్య పరీక్షలు చేసే విధంగా సిబ్బందితో మాట్లాడారు. అలాగే గ్రామంలో లింగ నిర్ధారణ పరీక్షలను నియంత్రించాలని, అలాంచి వారికి కౌన్సిలింగ్ ఇవ్వాలని సూచించారు. రోడ్లు, పౌరసరఫరాల బాద్యుడైన కందురూరి విజయంచదర్ గ్రామంలో సీసీ రోడ్ల ఏర్పాట్లపై, బీసీ కాలనీలో రేషన్ పంపిణీపై గ్రామస్థులతో కలిసి మాట్లాడారు.

**గ్రామ పంచాయితీ కార్యాలయం-ముప్పారం**

| క్ర.సం | పేరు | శాఖ (బాధ్యతలు) |
|---|---|---|
| 1. | శ్రీమతి గుంటిపల్లి రేణుక వెంకట్ గారు, సర్పంచ్ | సాధారణ పాలన, పన్నులు, శాంతి భద్రతలు, ఇతరములు |
| 2. | శ్రీ తాళ్లపల్లి కుమారస్వామి గారు, ఉపసర్పంచ్ | వీధి లైట్లు, గ్రామ విద్యుద్దీకరణ(విద్యుత్ శాఖ), గీతా పారిశ్రామికాభివృద్ధి |
| 3. | శ్రీ గడ్డం గణేశ్ గారు | గొర్రెల పెంపకం, పశుసంవర్ధకం, సహకార సంఘాలు, గిడ్డంగులు |
| 4. | శ్రీమతి వెల్దండి శ్వేత విద్యాసాగర్ గారు | తాగునీరు, పారిశుద్యం, పెన్షన్లు (పంచాయితీరాజ్), చేనేత సంక్షేమం |
| 5. | శ్రీ వేములకొండ యాదగిరి గారు | చెరువు పరిరక్షణ, నీటి పారకం, సాగుకాలువలు, (నీటి పారుదల శాఖ) |
| 6. | శ్రీమతి గోకల ప్రణీత సలీం గారు | వైద్యారోగ్యం, ఆశావర్కర్ల పర్యవేక్షణ |
| 7. | శ్రీ నరేండ్ల రాజేశ్ గారు | పాఠశాలల అభివృద్ధి, యువజన సంఘాలు, క్రీడలు (విద్యాశాఖ), గృహనిర్మాణం |
| 8. | శ్రీమతి ముంజ క్రిష్ణవేణి అశోక్ గారు | మహిళా శిశు సంక్షేమం, అంగన్ వాడీలు, వివోలు, ఐకెపిల పర్యవేక్షణ |
| 9. | శ్రీ మారబోయిన జయ సదానందం గారు | చేపల పెంపకం, మత్స్యకారుల అభివృద్ధి (మత్స్య శాఖ) |
| 10. | శ్రీమతి ఎతిరాజుల శోభారాణి మల్లయ్య గారు | వ్యవసాయం, పాడి పరిశ్రమ, దేవాలయాల అభివృద్ధి |
| 11 | శ్రీమతి చిట్యాల సునీత బాలస్వామి గారు | గ్రామీణ ఉపాధి (కరువుపనులు) మరియు సంక్షేమ శాఖ (ఎస్సీ,ఎస్టీ,బీసీ) |
| 12 | శ్రీ కందుకూరి విజయ్‌చందర్ గారు | రోడ్లు, భవనాలు, నిత్యావసరాలు (పౌర సరఫరాలు) |
| 13 | శ్రీమతి కర్నే రాధ గణేశ్ గారు | కార్మిక, దినసరి కూలీలు, ఉపాధి కల్పన |

# రాజ్యాంగ విలువలతోనే గ్రామ అభివృద్ధి సాధ్యం

**కరుణాపురం సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్**

**ధర్మసాగర్,జనవరి27(తెలంగాణ ముచ్చట్లు):** కరుణాపురం గ్రామంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ గుర్రపు రీనా ప్రవీణ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని, రాజ్యాంగ విలువలను ఆచరణలో పెట్టినప్పుడే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామ సంక్షేమం కోసం ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని, పరస్పర సహకారంతోనే అభివృద్ధి లక్ష్యాలు చేరుకోగలమని తెలిపారు.




ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ పద్మ, ఉప సర్పంచ్ ఆకారపు అనిల్ కుమార్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.





# బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు అందుకున్న తాటికాయల గ్రామ పంచాయతీ కార్యదర్శి చామంతి

- పంచాయతీ కార్యదర్శి చామంతికి ప్రశంసల వెల్లువ
- ఘనంగా సన్మానించిన గ్రామ ప్రజాప్రతినిధులు,ప్రజలు



**ధర్మసాగర్,జనవరి 27(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మండలంలోని తాటికాయల గ్రామ పంచాయతీ కార్యదర్శి చామంతి బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ చేతుల మీదుగా స్వీకరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ఈ అవార్డులు ప్రదానం చేస్తుంటుంది. ఈ క్రమంలో తన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందుకోవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని చామంతి తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలందించాలనే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అవార్డు పొందిన విషయం తెలుసుకున్న వెంటనే గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి చామంతిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ననుబాల సోమక్క చంద్రమౌళి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శి చామంతి కీలక పాత్ర పోషించారని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేసినందుకే ఈ అవార్డు దక్కిందని అన్నారు. ఇలాంటి గుర్తింపులు మరింత బాధ్యతతో పనిచేయడానికి ప్రేరణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ననుబాల సోమక్క చంద్రమౌళి, ఉపసర్పంచ్ పెసరు శివ కృష్ణ, మాజీ సర్పంచ్ పెసరు రమేష్, వార్డు సభ్యులు పట్ల రమేష్, సుమన్, బిట్టు, స్వామి, యాదమ్మ, అనిత, ఉమా, కృష్ణవేణి, నాయకులు భాస్క రవీందర్, బొల్లెపాక కుమార్, కనుకటి యాదగిరి, దుబాల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in